# కాల్ సెంటర్ ఫిర్యాదులను
# డిజిటలైజ్ చేయాలి

- అధికారులకు సూచించిన జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్
- ధాన్యం, పత్తి కొనుగోళ్లలో ఫిర్యాదుల నమోదుకు 1077కు కాల్ చేయాలి
- కాల్ సెంటర్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్





**ఖమ్మం నవభూమి బ్యూరో, నవంబర్ 18:** కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన కాల్ సెంటర్ కు వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు డిజిటలైజ్ చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ లో ఉన్న కాల్ సెంటర్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కాల్ సెంటర్ లో నమోదైన ఫిర్యాదుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే, ధాన్యం కొనుగోలు, పత్తి కొనుగోలులో ప్రజలకు, రైతులకు ఏదైనా సమస్యలు ఉంటే కాల్ సెంటర్ టోల్ ఫ్రీ నెంబర్ 1077 కు ఫోన్ చేసి ఫిర్యాదు నమోదు చేయాలని, ఆ ఫిర్యాదులను సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. 1077 కు వచ్చే ప్రతి ఫిర్యాదులను డిజిటలైజేషన్ చేసి ప్రతిరోజు నివేదిక అదనపు కలెక్టర్ కు అందించాలని కలెక్టర్ అన్నారు. కాల్ సెంటర్ కు వచ్చే ఫిర్యాదుల సత్వర పరిష్కారం లభించేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీలలో జిల్లా కలెక్టర్ వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, ట్రైనీ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, కాల్ సెంటర్ ఇంచార్జ్ రజిత, అధికారులు, తదితరులు ఉన్నారు.

## మానవత్వం చాటుకున్న ఐటిడిఎ పిఓ రాహుల్



**కొత్తగూడెం (భద్రాచలం) నవంబర్ 18 నవభూమి ప్రతినిధి:** పుట్టుకతోనే నిమ్ము వ్యాధితో బాధపడుతున్న చంటి పాపకు వైద్యం చేయించుకోవడానికి ఐటీడీఏ రిలీఫ్ ఫండ్ నుంచి ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆర్థిక సహాయం చేశారు. సోమవారం తన ఛాంబర్ లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం మండలం ఏ ఎస్ ఆర్ కాలనీకి చెందిన ఎస్. రాధ తన బిడ్డ పుట్టుకతోటే నిమ్ము వ్యాధితో బాధపడుతుందని, ఐటీడీఏ పీవో కు విన్నవించగా చంటి పాప వైద్యానికి ఐటీడీఏ రిలీఫ్ ఫండ్ నుంచి 25 వేల రూపాయల చెక్కును అందించి చంటి పాపకు సరియైన వైద్యం చేయించాలని ఆమెకు పిఓ తెలిపారు

## క్యూరింగ్ చేయకపోతే కూలిపోదా?




**రుద్రంపూర్ నవంబర్18 నవభూమి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం ధన్బాద్ గ్రామ పంచాయితీ లో సింగరేణి వారు పెద్ద ఎత్తున వాటర్ ట్యాంక్‌ను ప్రజల ఆవాసాల మధ్య నిర్మిస్తున్నారు. కానీ ఈ నిర్మాణానికి క్యూరింగ్ చేయకుండా కట్టుదిట్టంగా భద్రత ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యం వహించింది సింగరేణి యాజమాన్యం. ధన్బాద్ గ్రామంలో ఏర్పాటు చేస్తున్న ఈ నిర్మాణానికి గ్రామ సెక్రెటరీ నుంచి కానీ ఉన్నతాధికారుల నుంచి గాని ఎలాంటి అధికారాలు లేవు. క్యూరింగ్ చేయని ఈ కట్టడం ఏ సమయాన కూలిపోయి ఎవరికి ప్రాణహాని తలపెడుతుందోనని గ్రామస్తులు వాపోతున్నారు. వేచి చూడాలి ఏ అధికారి స్పందిస్తారో?

## ర్యాగింగ్ ఘటనలో.. సహాయ ఆచార్యుడి సస్పెన్షన్

**ఖమ్మం-నవభూమి:** ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఓ విద్యార్థికి సహాయ ఆచార్యుడు గుండు గీయించిన సంఘటనపై డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) డా.వాణి తీవ్రంగా స్పందించారు.
బాధ్యుడైన సహాయ ఆచార్యుడిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. ఆయనను సస్పెండ్ చేస్తూ సోమవారం రాత్రి డీఎంఈ ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 17న ప్రచురితమైన కథనం సంచలనం సృష్టించింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం ఖమ్మం కళాశాల ఆవరణలో ప్రిన్సిపల్ రాజేశ్వరరావు నేతృత్వంలో యాంటీ ర్యాగింగ్ కమిటీ, ప్రత్యేక విచారణ కమిటీ బాధ్యులు సుదీర్ఘ విచారణ నిర్వహించింది.
సీనియర్ విద్యార్థులను, బాధిత విద్యార్థిని, అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను ప్రత్యేకంగా విచారించారు. ప్రొఫెసర్ వ్యవహరించిన తీరును విచారణాధికారులు తప్పుబట్టారు. అనంతరం డీఎంఈకి నివేదికను సమర్పించారు. ఈ క్రమంలో ఉన్నతాధికారి సస్పెన్షన్ ఉత్తర్వులు వెలువరించారు.


# నవభూమి



జిల్లా అనుబంధం

19 నవంబర్,2024 మంగళవారం పేజీలు:11

www.epaper.navabhoomi.in




# మాజీలు గతంలో పార్టీలు ఎవరికోసం మారారు

- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఎద్దేవా!
- కొత్తగూడెం అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్నా:మీ అందరి సహకారం కావాలి
- రామవరంలో విమానాశ్రయం రాబోతుంది..దిల్లీకి వెళ్లి సాధించుకొస్తా...



**కొత్తగూడెం నవంబర్ 18 నవభూమి ప్రతినిధి:** ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కొత్తగూడెంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సోమవారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చివరివరకు కమ్యూనిస్టు గానే ఉంటా అన్నారు. పార్టీలు మారే అలవాటు తనకు లేదని, గతంలో పార్టీలు మారిన వారు ప్రజల కోసం పార్టీలు మారారా? ఒక్కొక్క మాజీ ఎమ్మెల్యేలు నాలుగు ఐదు పార్టీలు మారారు అని ఎద్దేవా చేశారు. కమ్యూనిస్టు అంటేనే పోరాటాల పార్టీ ఎన్నోసార్లు జైలుకు వెళ్లా, పేదలకు ఎన్నో ఇల్లు ఇప్పించ అన్నారు. ఎన్నో ప్రాంతీయ పార్టీలు వచ్చి కనుమరుగైపోయాయి.సిపిఐ పార్టీ త్వరలో 100 ఏళ్లు పూర్తి చేసుకొని వందేళ్ళ ఉత్సవాలు జరుపుకోబోతున్నామని చెప్పారు. రోజు రెండు మూడు గంటలు మాత్రమే నిద్రపోతున్నానని, కొత్తగూడెం అభివృద్ధి కోసం నిత్యం శ్రమిస్తున్నానని, తనకు ఓటు వేసిన ఓటు వేయకపోయినా ప్రజలందరి అభివృద్ధికి కృషి చేస్తున్నానని అన్నారు. కుడా తీసుకొచ్చామని కొత్తగూడెం పాల్వంచను కలిపి మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నామని, అలానే రామవరంలో విమానాశ్రయం రాబోతుందని, దానికోసం తీవ్రమైన ప్రయత్నం చేస్తున్నామన్నారు. త్వరలో ఢిల్లీ వెళ్తున్నా, పౌర విమాన యాన శాఖ మంత్రి రాంమోహన్ నాయుడిని కలుస్తా, మంత్రి తుమ్మల, మరో మంత్రి కోమటిరెడ్డి కూడా ఎయిర్పోర్ట్ కోసం గట్టి ప్రయత్నం చేస్తున్నారన్నారు. మునిసిపల్ అభివృద్ధి పనులు నాణ్యత తో పూర్తీ చేయాలని ఆదేశించారు. పనుల పురోగతిపై ఆరా తీశారు.100 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్క్,ఐటీ హబ్ కోసం కృషి చేస్తున్న అని, సింగరేణి కాంప్లెక్స్ ను సుందరీకరిస్తామన్నారు. 4 ఎకరాల్లో ఇంటిగ్రెటెడ్ పాఠశాల 18 ఎకరాల్లో స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను నిర్మిస్తామన్నారు. గొల్లగూడెం రోడ్డు వెడల్పు కు మోక్షం పాత 3 టౌన్ వద్ద నుండి గొల్ల గూడెం రోడ్డు వెడల్పునకు రైల్వే శాఖ సూత్రప్రాయంగా అంగీకరించిందని, ఇందుకు ఎంపీ రఘురామిరెడ్డి కూడా లేఖ ఇచ్చారాన్నారు. రైల్వే కు ఇందుకు రూ 15 కోట్లు చెల్లించాలని చెప్పారు. లేదా ఇందుకు బదులు ఖమ్మం లో ప్రభుత్వ భూమి అడుగుతున్నారని ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వెంట మున్సిపల్ కమిషనర్, ఆయా అవార్డుల కౌన్సిలర్లు, సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా తదితరులు ఉన్నారు



వెదురు.. వంతెన

ఇంద్రావతి నదికి ఆవలవైపు బీజాపూర్, దంతెవాడ జిల్లాల సరిహద్దులోని ఉన్న మంగనార్ గ్రామ ఆదివాసీలు గుద్రా నదిపై స్వతహాగా వెదురు.. రాళ్లతో పిల్లర్లు ఏర్పాటు చేసి దెబ్బతిన్న స్తంభాలను సేకరించి వంతెన నిర్మించుకున్నారు. అత్యంత నక్సల్స్ ప్రభావిత ప్రాంతం కావడంతో ఇక్కడి ఆదివాసీలు వంతెన నిర్మాణం కోసం ప్రభుత్వాన్ని డిమాండ్ చేయలేని పరిస్థితి నెలకొంది.
చర్ల-నవభూమి

# ఎస్సీ ఎస్టీ మైనార్టీ ఇల్లు కిరాయికి ఇవ్వకూడదు

## శ్రీ సాయి నిలయం అపార్ట్మెంట్లో నిబంధనలు

## అపార్ట్మెంట్ బయట ఫ్లెక్సీ !

## రూరల్ సీఐకి పిర్యాదు ఎస్టీ నాయకులు



**ఖమ్మం నగరం, నవభూమి, నవంబర్18:** కరుణగిరి ప్రాంతం శ్రీ సాయి నిలయం అపార్ట్మెంట్ కమిటీ నిర్వాహకులు , అపార్ట్మెంట్లలో ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనారిటీ వర్గాల వారికి ఇల్లు కిరాయికి ఇవ్వకూడదని నిబంధన పెట్టి ఫ్లాట్ ఓనర్ ఇమామ్ పాషా కు , వాచ్మెన్ కు కమిటీ వారు ఆదేశాలు జారీ చేశారు. అపార్ట్మెంట్ బయట ఫ్లెక్సీ కూడా పెట్టారు. ముస్లిం మైనారిటీ, ఎస్సీ, ఎస్టీ కులాల వారి మనోభావాలను కించపరిచే విధంగా ఆదేశాలు జారీ చేయడం, ఫ్లెక్సీ పెట్టడం సరైనది కాదని వెంటనే వారిపై తగు చర్యలు తీసుకుని అరెస్టు చేసి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని రూరల్ సీఐ రాజు కు ఎస్టీ నేతలు పిటిషన్ అందజేశారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో ఎక్కడ కూడా పునరావృత్తం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శరత్ నాయక్, రమేష్ నాయక్, శోభన్ నాయక్, లచ్చు నాయక్, రవి రాథోడ్, లింగ నాయక్, నెహ్రూ నాయక్, వినోద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# దొంగలించబడిన ఫోనును అప్పగించిన పోలీసులు



**ఎర్రుపాలెం, నవభూమి, నవంబర్ 18 :** మండల పరిధిలోని జమలాపురం గ్రామానికి చెందిన వాసిరెడ్డి శ్రీనివాసరావుకు చెందిన మొబైల్ ఫోను ఇటీవల దొంగిలించబడినది.దీనిపై శ్రీనివాసరావు జమలా పురం గ్రామంలోని తన ఫ్యాన్సీ షాపు వద్ద ఉంచిన తన సెల్ ఫోన్ పోయినదని ఎర్రుపాలెం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.ఈ ఫిర్యాదుపై ఎస్సై వెంకటేష్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు.ఏఎస్ఐ గోపాల్ రావు ట్రేస్ చేసి ఫోన్ ను కనుగొన్నారు.సోమవారం ఎస్సై వెంకటేష్ చేతుల మీదగా వాసిరెడ్డి శ్రీనివాస రావుకు ఫోన్అందించారు. ఈ కార్య క్రమంలో ఎస్సై వెంకటేష్,ఏఎస్ఐ గోపాలరావు,కానిస్టేబుల్ ప్రకాష్ పాల్గొన్నారు

# ఎకో తేజస్ శ్రీ లక్ష్మి ఈవీ హబ్, ఈ - ఎలక్ట్రిక్ బైక్ షోరూంను ప్రారంభించిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్‌నగర్ నవభూమి ప్రతినిధి :** షాద్ నగర్ పట్టణం లోని ఎస్సార్ పెట్రోల్ బంక్ ఎదురుగా శ్రీ ఎకో తేజస్ శ్రీ లక్ష్మి ఇవీ హబ్ ఈ - ఎలక్ట్రిక్ బైక్ షోరూం ను షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం, టౌన్ అధ్యక్షులు కొంకళ్ళ చెన్నయ్య, బాసవేశ్వర్, బాబర్ ఖాన్, కృష్ణ రెడ్డి, గంధం సురేష్, రాము ,నాగిళ్ళ గోపాల్ గుప్త, మాజీ కౌన్సిలర్ మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# యస్సీ వర్గీకరణ లేకుండా ఉద్యోగ నోటిఫికేషన్‌లు వద్దు

- ఉమ్మడి జిల్లా స్థాయి ఎంఆర్‌పియస్, ఎంఎస్‌పి సమీక్షా సమావేశం
- ముఖ్య అతిథిగా ఎంఆర్ పియస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్

**జూలురుపాడు,నవంబర్ 18 (నవభూమి ప్రతినిధి)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యస్సీ వర్గీకరణ చేసేంతవరకు ఉద్యోగాల నియామకానికి సంబంధించిన నోటిఫికేషన్ లు ఇవ్వవద్దని ఎం ఆర్ పి యస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద్ నరేష్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి విజ్ఞప్తి చేశారు.సోమవారం మండల కేంద్రంలో ఒక వేడుకల మందిరంలో ఉమ్మడి ఖమ్మం,భద్రాద్రి జిల్లా ఎం ఆర్ పి యస్, ఎం ఎస్ పి అనుబంధ సంఘాల సమీక్షా సమావేశానికి ముఖ్య అతిథి గా హాజరై ప్రసంగించారు.గత ముప్పై సంవత్సరాలుగా యస్సీ కేటగిరీ లో 59 కులాలకు సామాజిక న్యాయం అందాలని విద్యా, ఉద్యోగ రంగాలలో వర్గీకరణ అమలు చేయాలని మందా కృష్ణ మాదిగ నేతృత్వంలో ఉద్యమం చేస్తున్నామని అన్నారు.ఎట్టకేలకు సర్వోన్నత న్యాయ స్థానం ఇచ్చిన తీర్పు తో అడ్డంకులు తొలిగి పోయాయని




యస్సీ,ఎస్టీ వర్గాలలో ఆర్థికంగా వెనుకబాటు తనం ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ చేసుకొనే అధికారం వుందని తీర్పు ఇచ్చిందని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం చర్యలు గైకొని మాదిగలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్య క్రమంలో ఎం ఎస్ పి రాష్ట్ర అధ్యక్షులు ఇంజం వెంకటయ్య, భద్రాద్రి జిల్లా కన్వీనర్ నల్లగట్ల వెంకన్న, ఖమ్మం జిల్లా అధ్యక్షులు కూరపాటి సునీల్, ఎం ఆర్ పి యస్ సీనియర్ నాయకులు కొత్తపల్లి సోమయ్య, వంగూరి ఆనంద రావు,బచ్చలకూర వెంకటేశ్వర్లు, ఏపూరి వెంకటేశ్వర్లు,తోళ్ళ వెంకన్న,దేపంగి రమణయ్య, చెంగల గురునాధం,తూరుగంటి అంజయ్య, మండల అధ్యక్షులు దెబ్బెందుల సాయి కుమార్ తది తరులు పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లాలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు









**ఖమ్మంనగరం, నవభూమి,నవంబర్18 :** ఖమ్మం జిల్లాలో సోమవారం రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ అధికారులు, పలు ఆహార తయారీ కేంద్రాలు, అల్లం వెల్లుల్లి స్టోరేజ్, విక్రయ కేంద్రాలు, స్వీట్ తయారీ కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ టీం హెడ్, జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి. జ్యోతిర్మయి ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ ఫుడ్ ఇన్స్పెక్టర్స్ పి. రోహిత్ రెడ్డి, పి. స్వాతి, పి. మనోజ్ కుమార్, బి. రతన్ రావులతో కూడిన బృందం ఖమ్మం పట్టణంలో రిక్కా బజార్ లోని మ్యాజిక్ అల్లం, వెల్లుల్లి తయారీ కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు జరపగా, తనిఖీల్లో పలు ఉల్లంఘనలు బయటపడ్డాయి. ఎఫ్.ఎస్.ఎస్.ఏ.ఐ లైసెన్స్ లేకుండా తయారీ, స్టోరేజ్, విక్రయ యూనిట్ చట్ట బద్ధమైన లైసెన్స్ లు లేకుండా బిజినెస్ జరుపుతున్నందున, అల్లం వెల్లుల్లి మిశ్రమాల యొక్క బాటిల్స్ పై లేబుల్ లోపాలు బ్యాచ్ నంబర్, ఎఫ్ ఎస్ సి ఐ లోగో తయారీ, రీప్యాకింగ్, చిరునామా సరైన వివరాలు లేనందున, నిర్వహణ లోపాలు నిల్వ ప్రాంగణం అపరిశుభ్రంగా ఉండటం, అల్లం వెల్లుల్లి పేస్టను డిటర్జెంట్లు, ఫినాయిల్ వంటి రసాయనాల పక్కనే నిల్వ చేయడం వల్ల అల్లం వెల్లుల్లి తినే ఆహార పదార్థాలు డిటర్జెన్సీ ఫినాయిల్ వంటి కెమికల్స్ తో క్రాస్ కంటామినేషన్ జరగడం, అది నకిలీ పేస్ట్ అని అనుమానం, పేస్ట్‌లో దుర్గంధం ఉండటం, అతి తక్కువ ధరకు రిటైలర్లకు విక్రయం చేయడం, తద్వారా నాణ్యతా లోపాలు, కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ గా అనుమానించి నమూనాలు సేకరించి, లక్ష 32 వేల విలువగల 960 కేజీల అల్లం, వెల్లుల్లి మిశ్రమాన్ని సీజ్ చేయడం జరిగింది. సేకరించిన నమూనాలను పరీక్ష కోసం ప్రయోగశాలకు పంపిస్తున్నామని అధికారులు తెలిపారు. చర్చ్ కాంపౌండ్ లో గల విజయలక్ష్మి పిండి వంటలలో పూర్తిగా అపరిశుభ్రంగా ఉన్న వంట గదిలో ఆహార పదార్థాలు తయారు చేయడం, క్యాన్సర్ కారకాలైనటువంటి రసాయన రంగులను అధిక మోతాదులలో స్వీట్లలో ఉపయోగించడం, బ్యాచ్ నెంబర్ మ్యానుఫ్యాక్చరింగ్ డేట్, లైసెన్స్ నెంబర్ లేనటువంటి 6,550 రూపాయల విలువ గల మిస్ బ్రాండెడ్ పిండి వంటలను, పచ్చళ్లను, ఇతర దుమ్ము, ధూళి అపరిశుభ్ర వాతావరణంలో ఉన్న ఆహారాలను గుర్తించి అక్కడికక్కడే ధ్వంసం చేసి, పలు అనుమానిత శాంపిల్లను సేకరించి పరీక్ష నిమిత్తం తరలించడం జరిగింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం చేస్తున్నందుకు గాను వారికి నోటీసులు, ఇంప్రూవ్మెంట్ నోటీసులు జారీ చేయడం జరిగింది. అలాగే మయూరి బజార్లో గల హరి స్వీట్ హౌస్ లో తనిఖీ చేయగా పూర్తిగా అపరిశుభ్ర వాతావరణంలో తయారీ నిర్వహించడం, అధిక మోతాదులో రసాయన రంగులను వాడడం, ఎక్స్పైర్ కలర్ స్పేస్ టాపింగ్ క్రీమ్స్, మిల్కీ మిస్టర్ క్రీమ్, ఇతర పదార్థాలు సుమారు 6950 రూపాయలు ఆహార పదార్థాలను గుర్తించి అక్కడికక్కడే ధ్వంసం చేసి ఫుడ్ సేఫ్టీ ఆక్ట్ చట్టానికి విరుద్ధంగా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నందుకుగాను నోటీసులు జారీ చేయడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర ఆహార భద్రతా టాస్క్ ఫోర్స్ అధికారులు ఆహార నాణ్యత, ఆహార పరిరక్షణ మీద తీవ్ర హెచ్చరికలు చేశారు. ఖమ్మం పట్టణంలోని కొందరు వ్యాపారులు తాము తయారుచేసి, విక్రయించే ఆహార పదార్థాలలో అధిక మోతాదులో రంగులు వినియోగించడం, అనారోగ్యకరమైన పరిసరాలలో ఆహార పధార్థాలు తయారు చేయడం, ప్రమాదకరమైన రంగులను ఉపయోగించడం, గడువు ముగిసిన ఆహార పదార్థాలను విక్రయించడం, మిస్ బ్రాండింగ్ ఐటమ్స్ ని కొంతమంది అవగాహన లేక అది తక్కువ సమయంలో అధిక లాభార్జన కోసం ఆహారాన్ని కల్తీ చేయడం వంటి చర్యలు ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నాయని గుర్తించారు. ఇంకా ఆహార తయారీలో కీటకాలు, దుమ్ము, బూజు వంటి నాణ్యతా లోపాలున్న ముడి పదార్థాలను ఉపయోగించడం, వంట నూనెలను పదేపదే మరిగించడం వంటి చర్యలు అల్సర్, క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధుల వ్యాప్తికి దారితీసే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో, ఆహారం విక్రయించే వ్యాపారులు ప్రజలకు సురక్షిత ఆహారం అందించేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పలు నోటీసులు జారీ చేశారు. నిబంధనలు పాటించని, అనుమతులు లేకుండా కార్యకలాపాలు నిర్వహిస్తున్న వ్యాపారాలపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, అవసరమైతే సీజ్ చేస్తామని రాష్ట్ర టాస్క్ ఫోర్స్ టీం హెడ్ వి. జ్యోతిర్మయి తేల్చిచెప్పారు. ప్రజల ఆరోగ్యం రక్షణ కోసం తెలంగాణ ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ కఠిన చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉందని, వ్యాపారులు నిబంధనలు పాటిస్తూ బాధ్యతతో వ్యవహరించాలని రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ టీం హెడ్ అయిన వి. జ్యోతిర్మయి, టాస్క్ ఫోర్స్ అధికారులు సూచించడం జరిగింది.

## ఆ అన్నదమ్ములు, సరస్వతి పుత్రులు- వారికి సలామ్



**ఖమ్మం రూరల్, నవభూమి, నవంబర్ 18 :** నిరుపేద కుటుంబానికి చెందిన అన్నదమ్ములు, సరస్వతి పుత్రులు. వారికి అందరూ సలామ్...చేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న వారికి మరోసారి ఉద్యోగాలు వరించడమే అందుకు కారణం. గతంలోనే ఈ అన్నదమ్ములు ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తూ, ఇటీవల గ్రూప్ 4లో మరోసారి ప్రభుత్వ ఉద్యోగాలను సాధించారు. సరస్వతి దేవి కటాక్షం ఉంటే వారు పేదరికంలో ఉన్నా సరే విజయానికి ఏమాత్రం అడ్డంకి కాజాలదని వారు నిరుపించుకున్నారు. ఖమ్మం రూరల్ మండలం గోళ్ళపాడు గ్రామానికి చెందిన గీత కార్మికుడు గడ్డం మీది వెంకటేశ్వర్లు - వెంకట్రావమ్మ దంపతుల కుమారులు లెనిన్ కుమార్, మనోజ్ కుమార్. తండ్రి వెంకటేశ్వర్లు సాధారణ గీత కార్మికుడు కాగా, తల్లి వెంకట్రావమ్మ గ్రామంలో గ్రామ దీపికగా పనిచేస్తున్నారు. చిన్ననాటి నుండి వారిరువురు విద్యలో ప్రతిభ చాటుకుంటూ సరస్వతి పుత్రులుగా పేరు తెచ్చుకున్నారు. లెనిన్ కుమార్ ఇటీవల గ్రూప్ ఫోర్ లో ట్రెజరీ డిపార్ట్మెంట్లో జూనియర్ అకౌంటెంట్గా, మనోజ్ కుమార్ రెవెన్యూ డిపార్ట్మెంట్ లో జూనియర్ అసిస్టెంట్ గా ఉద్యోగాలను సాధించారు. గతంలోనే వీరిరువురు ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తుండటం విశేషం. ఒకరు కేరళ రాష్ట్రంలోని బిఎస్ఎన్ఎల్ లో జె టి ఓ గా, మరొకరు ఫారెస్ట్ డిపార్ట్మెంట్ లో బీట్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తున్నారు. ఉద్యాగాలు చేస్తూనే మరోసారి ఉద్యోగాలను పొందడం హర్షణీయం... సరస్వతి పుత్రులారా మీకు సలాం అంటున్నారు అందరూ.

## తెలుగుదేశం పార్టీ నాయకులు అరెం రామయ్యకు మాతృ వియోగం





**జూలురుపాడు,నవంబర్ 18(నవభూమి ప్రతినిధి)** ఏనుకూరు మండలం ఒంటి గుడిసె గ్రామానికి చెందిన విశ్రాంత సింగరేణి అధికారి,ఉమ్మడి ఖమ్మం జిల్లా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు అరెం రామయ్య మాతృమూర్తి,ఏనుకూరు మండల మాజీ ఎం పి పి ఆరెం వరలక్ష్మి అత్త భద్రమ్మ ఆదివారం పరమ పదించారు.సమాచారం తెలుసుకున్న జూలూరుపాడు,ఏనుకూరు మండలాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు భద్రమ్మ భౌతిక దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.మండలానికి చెందిన ఎం ఆర్పి యస్ మాజీ మండల అధ్యక్షులు మోదుగు సుగుణ రావు,తెలంగాణ రాష్ట్ర మాదిగ జే ఏ సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోదుగు జోగారావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు వేల్పుల నరసింహా రావు, పోతురాజు నాగరాజు, కోట కుమార్, సీనియర్ పాత్రికేయులు, టి యూ డబ్ల్యూ జే జిల్లా ఉపాధ్యక్షులు కొలిపాక చంద్ర శేఖర్,పాత్రికేయులు మోదుగు ప్రభాకర్,షేక్ సిద్దిక్,మోదుగు ఆదమ్ వేల్పుల సన్నీ తది తరులు పూల మాలలతో ఘనంగా నివాళి అర్పించి రామయ్య కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి సంతాపం వ్యక్తం చేశారు. మాల మహానాడు మండల నాయకులు బుడి పూడి ప్రభాకర్, ఇళ్ళంగి తిరుపతి, పోతురాజు రామారావు, ఏనుకూరు మాజీ ఎం పి పి మాలోతు బాన్య నాయక్, కోపెల రామరావు తదితరులు నివాళులు అర్పించారు



## మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం

■ టూ టౌన్ సిఐ రమేష్





**రుద్రంపూర్ నవంబర్18 నవభూమి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం ధన్బాద్ గ్రామపంచాయతీలో టూ టౌన్ సిఐ రమేష్, ఎస్ఐ షహనా, వారి సిబ్బంది మత్తు పానీయాలు, మాదకద్రవ్యాలు, గంజాయి లాంటి వాటిని వేర్లతో సహా పెకిలించేందుకు ప్రత్యేక చొరవ చూపిస్తున్నారు. ఇట్టి మాదకద్రవ్యాలను వాడటం వల్ల మన శరీరంలో వచ్చే దుష్ప్రభావాలను వివరించారు. అదేవిధంగా దేశాన్ని ముందుకు నడిపించే యువత మత్తు పదార్థాలకు బానిసై తమ జీవితాన్ని కోల్పోతున్నారని అన్నారు. అదేవిధంగా ఈ మాదకద్రవ్యాలను సేవించేవారు మరియు అమ్మే వారిని నేరుగా పట్టించేందుకు డిపార్ట్మెంట్ ఒక శునకాన్ని ఏర్పాటు చేశారని ఆ శునకం సహాయంతో గతంలో కోట్లాది సరుకు పట్టుకున్నామని ఇప్పుడు మన గ్రామాలకి కూడా వస్తుందని ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. అదేవిధంగా ఈ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తద్వారా గ్రామంలో జరిగే కార్యక్రమాలు తమ దృష్టికి వస్తాయని తామే స్వయంగా పర్యవేక్షిస్తామని తెలిపారు. తమ వంతుగా పోలీస్ వారికి సహాయపడాలని కోరారు. కొత్త వ్యక్తులు ఎవరైనా గ్రామంలో తిరిగితే వెంటనే వారికి తెలియజేయాలని అన్నారు. ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జేమ్స్ సునీల్, కీర్తి కుమార్, నగేష్, నాగరాజు, బైపల్లి శంకర్,రచ్చ రవి, బంటి, సునీల్ పాండే, శ్రీరాములు, సీతారాములు, నవీన్, చెరుపల్లి శ్రీను, గ్రామస్తులు పాల్గొన్నారు

## పోడు భూములకు త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించాలి

■ టిపిజిఎస్ జిల్లా కార్యదర్శి కారం పుల్లయ్య డిమాండ్

■ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో భద్రాచలం ఐటీడీఏ పిఓకి వినతిపత్రం



**చర్ల నవంబర్ 18 నవభూమి ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో చర్ల మండల పరిధిలోగల సత్యనారాయణపురం గ్రామంకు సంబంధించిన 180 కుటుంబాలు సుమారు 500 ఎకరాల సాగులో ఉన్నాయని, ఆదివాసీ పోడు రైతులు మాకు పట్టాలు అయితే వచ్చాయి గాని సరైన పంటలు వేసుకోవడానికి సాగు నీరు అందించడానికి అవకాశం లేదని, ఆ భూములకు వ్యవసాయ బోర్లు త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఐటీడీఏ పీవో కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఆకాశం మీద ఆధారపడి పత్తి మిర్చి వేస్తున్నాం అని కారం పుల్లయ్య వాపోయారు. అనుకూలంగా స్పందించిన ఐటీడీఏ పీవో రాహుల్ అదేవిధంగా త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం వ్యవసాయ బోర్లు అనుమతి మీ గ్రామపంచాయతీలో గ్రామసభ జరిపి మీ సమస్యను పరిష్కారం చేస్తానని ఐటీడీఏ పీవో హామీ ఇచ్చారు. అదేవిధంగా కారం మాట్లాడుతూ చర్ల మండలం విజయ కాలనీ సంబంధించిన ఆదివాసి రైతులు రెవెన్యూ పట్టాలు 23 మందికి ఉన్నాయి కానీ సొంతంగా వ్యవసాయ బోర్లు త్రీఫేస్ విద్యుత్ లైన్ కు డిడి కట్టేంత స్తోమత లేని కారణంగా తమరు మాకు మా భూములకు పంట బోర్లు, త్రి ఫేస్ విధి సౌకర్యం కల్పించి మమ్మల్ని ఆదుకోగలరని ఆ ఆదివాసి మహిళా రైతులు పివోను కోరారు. సానుకూలంగా స్పందించి ఈ సమస్యను పరిష్కరిస్తాం అని ఐటీడీఏ పీవో హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీఏజీఎస్ భద్రాచలం పట్టణ కార్యదర్శి కుంజా శ్రీను, చర్ల మండలం ఐద్వా మండల కార్యదర్శి పొడుపుగంటి సమ్మక్క, ఆదివాసి రైతులు శ్యామల కాంతయ్య, పర్శిక రామ్ కిరణ్, గట్టుపల్లి సురేష్, సోడి నాగమణి, సోయం రవి, కారం మహేష్, తెల్లం నాగేశ్వరావు, తుర్రం సమ్మక్క, పెద్ద ఎత్తున రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పత్తి రైతులను దగా చేస్తున్న దళారులు

■ సీజన్లో పెట్టుబళ్లు... అధిక వడ్డీలతో వసూళ్లు

■ ఊళ్ళల్లోనే పత్తిలోడ్లు

■ సీసీఐలో అమ్ముకుంటున్న దళారులు

■ పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు



**పూకె రామకృష్ణ / గుండాల నవంబర్ 18 నవభూమి:** మండలంలోని పత్తి సాగు చేస్తున్న రైతులను దళారులు దగా చేస్తున్నారు. సీజన్లో పత్తి విత్తనాలతో పాటు పురుగుమందులు అప్పులుగా ఇస్తూ తీరా పత్తి పండిన తర్వాత అధిక వడ్డీలు వేసుకుని రైతుల వద్ద ముక్కు పిండి మరీ పండించిన పత్తి పంటను ఉళ్ళల్లోనే కాటాలు పెట్టుకుని లోడ్లకు లోడులు లారీలు, మినీ వ్యాన్లకు లోడ్ చేసుకొని దొడ్డిదారిన సీసీఐకి తరలించి పెద్ద ఎత్తున సొమ్ము చేసుకుంటున్నారు. పత్తి సాగు చేస్తున్నా సీజన్లో రైతుల వద్ద పెట్టుబడులకు ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తడంతో ఆయా గ్రామాలలో ఉన్న దళారులను ఆశ్రయించక తప్పడం

ఓ మినీ వ్యాన్లో దళారులు లోడ్ చేస్తున్న పత్తి

లేదు. దీన్ని ఆసరాగా తీసుకున్న దళారులు రైతులకు అన్ని విధాలుగా పెట్టుబడులు పెట్టి అధిక మొత్తంలో వడ్డీ వేసుకొని పంటలు పండిన తర్వాత వారిచ్చిన సొమ్మును వడ్డీతో సహా జమ చేసుకొని మిగిలిన పైకాన్ని రైతులకు ముట్ట చెబుతున్నారు. సీసీఐ కేంద్రాల్లో రైతులు పత్తిని అమ్ముకుంటే ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అమ్ముకోవచ్చు. కానీ దళారులు పెట్టుబడి సాయం పెట్టడంతో వారు పండించిన పత్తిని సీసీఐ కేంద్రాలకు తరలించలేక వారికే ఇవ్వడంతో ప్రతి ఏటా పత్తి రైతు లాభాల కంటే నష్టాలనే చవిచూస్తున్నారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. దళారుల చేతులు తీవ్రంగా నష్టపోతున్న ఏజెన్సీ రైతులు. మండలంలోని మారుమూల గిరిజన గ్రామాలైన ఏజెన్సీ ప్రాంతాల్లోని రైతులను దళారులు తీవ్రంగా మోసం చేస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఖరీఫ్ సీజన్లో గిరిజన రైతులకు పెట్టుబడులను ఎరగా చూపి రైతుల శ్రమను దోసుకుంటున్నారంటంలో ఎటువంటి సందేహం లేదు. దీనిపై ప్రజలు పార్టీలు, ప్రజా సంఘాలు మౌనం గా ఎందుకు ఉంటున్నాయో తెలియని పరిస్థితి ఏర్పడింది

# మద్దతు ధరపై పత్తి పంటను కొనుగోలు చేయాలి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- తేమ శాతం ప్రకారం పత్తి పంటకు మద్దతు ధర చెల్లింపు
- రైతుల పొలాల వద్దే తేమ శాతం పరీక్షించాలి
- ఖమ్మం రూరల్ మండలం పొన్నేకల్ జిన్నింగ్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం నవభూమిబ్యూరో, నవంబర్ 18:** జిన్నింగ్ మిల్లులకు వచ్చే పత్తి పంటను మద్దతు ధరపై కొనుగోలు చేయాలని, తేమ శాతం ఆధారంగా రైతులకు చెల్లింపులు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా కలెక్టర్, ఖమ్మం రూరల్ మండలం పొన్నేకల్ జిన్నింగ్ మిల్లును అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, శిక్షణ సహాయ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠలతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, పత్తి పంట ఎన్ని ఎకరాలలో పండించారు, ఎప్పుడు తీసుకొని వచ్చారు, తేమ శాతం ఎంత ఉంది, మొదలగు వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. పత్తి పంట 8 శాతం తేమ ఉంటే క్వింటాల్ 7521 రూపాయల మద్దతు ధర వస్తుందని, 8 నుంచి 12 శాతం వరకు పెరిగే ఒక్కో శాతానికి 75 రూపాయల చొప్పున క్వింటాల్ కు మద్దతు ధర తగ్గించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. జిన్నింగ్ మిల్లుకు వచ్చిన తర్వాత తేమ శాతం రానిపక్షంలో రైతులు రవాణా ఖర్చులు నష్టపోతున్నారని, గ్రామాల వద్ద, రైతుల పొలాల వద్దే తేమ శాతం పరిరక్షించేందుకు గల అవకాశాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పత్తి పంట అధికంగా పండే గ్రామాలలో అదనంగా తేమ శాతం యంత్రాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. ప్రైవేట్ వ్యాపారస్తులు తేమ శాతం చూడకుండా కొంటున్నారని, దీని వల్ల రైతులు నష్టపోతారని, రైతులు పత్తి పంట ఆర బెట్టుకుని సీసీఐ కేంద్రాల ద్వారా మద్దతు ధరకు పత్తి విక్రయించాలని, మద్దతు ధర కంటే ఎక్కువ వస్తేనే ప్రైవేట్ వ్యాపారస్తులకు పత్తి అమ్మాలని కలెక్టర్ సూచించారు. జిన్నింగ్ మిల్లులకు వచ్చే రైతులకు టోకెన్ జారీ చేసి ఎప్పటికప్పుడు తేమ శాతం పరిశీలించి నాణ్యమైన పత్తి కొనుగోలు చేయాలని అన్నారు. కౌలు రైతుల వద్ద నుంచి కూడా పంట కొనుగోలుకు నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ జిన్నింగ్ మిల్లులో పత్తి ప్రాసెసింగ్, ప్యాకింగ్ తీరును పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తనిఖీ సమయంలో జిన్నింగ్ మిల్ వద్ద మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బి. హరినాథ్ బాబు, సెక్రటరీ పి. వీరాంజనేయులు, తల్లంపాడు ఏఈఓ వి. హిమ బిందు, ఖమ్మం రూరల్ ఎం.ఏ.ఓ. జే. ఉమా నగేష్, అధికారులు, రైతులు, తదితరులు ఉన్నారు.









# శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు



**ఎర్రుపాలెం, నవభూమి, నవంబర్ 18 :** తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన స్వయంభు జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు కార్తీకమాసం సందర్భంగా సోమవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతంలు నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా ప్రతి సోమవారం సామూహిక శ్రీ సత్యనారా యణస్వామి వ్రతములు నిర్వహిస్తున్నారు.నేడు సోమవారం ఆలయంలో నిర్వహించిన సామూహిక సత్యనారా యణ స్వామి వ్రతములలో గ్రామంలోని భక్తులతో పాటు, దేవాలయము చుట్టు పక్కల గ్రామముల నుండి 100మంది దంపతులు సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్నారు. అనంతరం తీర్థప్రసాదాలు అందించారు.సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతములు కార్తీక మాసంలోని అన్ని సోమవారములు, ఏకాదశుల రోజులలో నిర్వహించ బడతాయని ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస శర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస శర్మ,విజయ కృష్ణ,అర్చుకులు ఎం వెంకటరమణ,అర్చుకులు, సిబ్బంది,గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

# నేడు నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణకు హాజరై అభిప్రాయాలు తెలపాలి

### జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

### నేడే నవంబర్ 19 ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బిసి కమీషన్ ప్రతినిధుల బృందంచే ప్రజాభిప్రాయ సేకరణ



**ఖమ్మం కలెక్టరేట్, నవంబర్ 18:** నేడు నవంబర్19 ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బిసి కమీషన్ ప్రతినిధుల బృందంచే నిర్వహించు ప్రజాభిప్రాయ సేకరణలో ఉమ్మడి ఖమ్మం (భద్రాద్రి కొత్తగూడెం) జిల్లాలకు చెందిన ఆయా రాజకీయ పార్టీలు, సంఘాలు, ప్రజలు పాల్గొని తమ అభిప్రాయాలను తెలపాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బిసి వర్గాల విద్య, ఉద్యోగాలు, రాజకీయ, ఆర్థిక, సామాజిక అవసరమైన రిజర్వేషన్ల దామాషాను పేర్కొనే విషయంలో ఆసక్తి కలిగిన ఆయా రాజకీయ పార్టీలు, సంఘాలు, ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు వీలుగా తెలంగాణ బిసి కమీషన్ ప్రతినిధుల బృందం నేడు ఖమ్మంకు రానుందని కలెక్టర్ అన్నారు. అభిప్రాయాలు తెలియజేయాలనుకునే వారు రాతపూర్వక సమర్పణలు, అభ్యర్థనలను నేరుగా సమర్పించవచ్చని కలెక్టర్ అన్నారు. వ్రాతపూర్వక సమర్పణలు, అభ్యర్థనలు మొదలగునవి ఆరు సెట్లలో వెరిఫికేషన్ అఫిడవిట్ తో పాటుగా (రూ. 20/- నాన్-జ్యూడిషియల్ స్టాంపు పేపరుపై) నిర్దేశిత నమూనాలో తెలుగు లేదా ఆంగ్ల భాషలో ఇవ్వాల్సి ఉంటుందని, వారి వాదనలకు మద్దతుగా వారి వద్ద ఉన్న సమాచారం, మెటీరియల్, సాక్ష్యాలను, సంబంధిత కేసుల వివరాలను పేర్కొంటూ, సమర్పణలు, అభ్యర్ధనలు, సలహాలు, ఆక్షేపణలను కమీషన్ కు సమర్పించవచ్చని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# సమాజానికి ఉపయోగ పడ్డప్పుడే పేరు నిలుస్తుంది

- షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ 'వీర్లపల్లి శంకర్'
- 'ఆద్య డెంటల్ హాస్పిటల్' యజమాని డాక్టర్ రంజిత, గిరి దంపతులు రూ. 5 లక్షల విరాళం
- కళాశాల భవన నిర్మాణానికి పాటుపడుతున్న ఎమ్మెల్యే శంకర్ ఆశయం గొప్పదని కితాబు

**షాద్‌నగర్ నవభూమి ప్రతినిధి :** ప్రతి ఒక్కరు తమ సంపాదనలో కొంత సామాజిక సేవ అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించినప్పుడే చరిత్రలో తమ పేరును చిరస్థాయిగా నిలుపుకోగలుగుతామని షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ "వీర్లపల్లి శంకర్" అన్నారు.

సోమవారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణం కోసం స్థానిక ఎమ్మెల్యే చేపడుతున్న మహా కార్యక్రమానికి దాతలు స్పందిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణానికి చెందిన వైద్య దంత హాస్పిటల్ యజమాని డాక్టర్ రంజిత గిరి దంపతులు ఐదు లక్షల రూపాయల చెక్కును ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా అందజేశారు. కళాశాల అభ్యున్నతికి తమ వంతు ఆర్థిక సహకారం అందిస్తున్నట్లు డాక్టర్ రంజిత గిరి దంపతులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. సమాజంలో సంపాదనతో మంచి పేరు రాదని



తమ సంపాదనలో మంచి పనులు చేయడానికి వినియోగిస్తే కీర్తి ప్రతిష్టలు వస్తాయని దాతల కుటుంబానికి వంశానికి పేరు ప్రఖ్యాతలు లభిస్తాయని అన్నారు. డబ్బు సంపాదించడం గొప్ప విషయం కాదని ఆ డబ్బులు సన్మార్గంలో వినియోగించడమే గొప్ప విషయమని అన్నారు. ప్రతి ఒక్కరు తమకు ఉన్న దాంట్లో ఎంతో కొంత పేదల కోసం సమాజం కోసం ఉపయోగిస్తే ఆ పుణ్యం ఎంతో లభిస్తుందని అన్నారు. కళాశాల భవన నిర్మాణం కోసం దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమని డాక్టర్ రంజిత, గిరి దంపతుల సామాజిక సేవా విధానాన్ని ఎమ్మెల్యే శంకర్ అభినందించారు. డాక్టర్ రంజిత గిరి మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాల భవనానికి సొంతంగా ముందడుగు వేసి సమాజ నిర్మాణానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే శంకర్ తమకు దగ్గర బంధువు అని ఆయన చేస్తున్న ఈ మహా యజ్ఞం ఎంతో గొప్పదని అందులో తమ వంతు చిరు సాయం చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నేతలు అగనూరు విశ్వం, చెన్నయ్య, చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ ప్రకాష్ గౌడ్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి తుమ్మలను అన్నదాన పీఠానికి ఆహ్వానించిన అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి సభ్యులు



**ఖమ్మం, నవభూమి నవంబర్ 18:** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావును మర్యాదపూర్వకంగా కలిసిన అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి అయ్యప్పల అన్నదాన పీఠ సభ్యులు రాంప్రసాద్ గురుస్వామి, పగడాల కిషోర్, సముద్రాల శ్రీనివాసరావు, శీలం గోపాల్ రెడ్డి, పసుపులేటి నాగ కృష్ణ తుమ్మల గారిని వారు కలిసి సన్మానించి అన్నదాన పీఠాన్ని సందర్శించవలసిందిగా కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత 16 సంవత్సరాలుగా అయ్యప్పలకు దీక్షా సమయంలో అన్నదానం నిర్విఘ్నంగా నిర్వహిస్తు అన్నదాత పీఠం ద్వారా రోజుకు సుమారు 1000 నుంచి 1500 మంది భక్తులకు ఉచితంగా అన్నదానం నిర్వహిస్తున్న అన్నదాన పీఠం సభ్యులను అభినందించి పీఠాన్ని సందర్శిస్తానని తెలిపారు.

## మండలంలో పర్యటించిన ఎంపీ, ఎమ్మెల్యే



**ములకలపల్లి నవంబర్ 18 నవభూమి:** ములకలపల్లి మండలంలో పర్యటించిన ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాంరెడ్డి, అశ్వరావుపేట నియోజకవర్గం శాసనసభ్యులు ఆదినారాయణ. చాపరాలపల్లి గ్రామంలో జరిగిన ప్రముఖ వ్యాపారవేత్త కాంగ్రెస్ నాయకుడు సున్న జగదీష్ కుమార్తె వివాహ వేడుకలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించి, అనంతరం చాపరాలపల్లి మాజీ సర్పంచ్ సున్నం రాంబాబు కుమార్తె దశదినకర్మకు హాజరై చిత్రపటానికి నివాళులర్పించరు. ఈ కార్యక్రమంలో ములకలపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాండ్ర ప్రభాకర్ రావు, మండల కాంగ్రెస్ నాయకులు నాగళ్ల వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచులు కారం సుధీర్, సున్నం సుధాకర్, నల్లమోతు వెంకయ్య, కిసాన్ సెల్ మండల అధ్యక్షులు అచెన వెంకటేశ్వరరావు, యన్ జగదీష్, తన్నీరు లోకేష్, గాడి తిరుపతి రెడ్డి, సురభి రాజేష్, అశ్వరావుపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకులు పాలకుర్తి సుమిత్, గాడి సూర్యకేతన్ రెడ్డి, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ మండల నాయకులు వారితో పాల్గొన్నారు.

## జిల్లా విజ్ఞాన ప్రదర్శనలో అశ్వరావుపేట విద్యార్థులు



**అశ్వారావుపేట టౌన్ నవంబర్ 18 నవభూమి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట నియోజకవర్గం అన్నపురెడ్డి పల్లి లో జిల్లా వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రాజ్య స్థరీయ బాల వైజ్ఞానిక్ ప్రదర్శిని అశ్వరావుపేటకు చెందిన విద్యార్థులు తమ ప్రదర్శనలతో పాల్గొన్నారు. ఏడు ఉప అంశాలతో భావి శాస్త్రవేత్తలు తమ ప్రదర్శనలతో పోటీలో పాల్గొంటున్నారు. మండల వ్యాప్తంగా 72 ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్నారు. ఆయా పాఠశాలల విద్యార్థులు ఉపాధ్యాయులు ఘనంగా వారిని పోటీలకు పాల్గొనేందుకు ప్రోత్సహించారు.

# ఇల్లెందులో ఆర్యవైశ్యుల వనభోజనాలు విజయవంతం

- వన భోజన నిర్వహణ కమిటీ సేవలు అదుర్స్
- విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు
- కండె రమేష్, తాటిపల్లి సుబ్బారావు, ఎలుగూరి మధు







**ఇల్లెందు టౌన్ నవంబర్ 18 నవభూమి ప్రతినిధి:** ఇల్లెందు మండల, పట్టణ ఆర్యవైశ్య మహాసభ సంఘం, వాసవి క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్యవైశ్య వనభోజనం మహోత్సవ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయగా ఆ కమిటీ ఆధ్వర్యంలో వన భోజనాల కార్యక్రమం విజయవంతం అయ్యింది. కమిటీ వారిలో అధ్యక్షుడుగా కండె రమేష్ (శ్రీ హరి హర క్షేత్ర దేవాలయ కమిటీ డైరెక్టర్), ప్రధాన కార్యదర్శి తాటిపల్లి సుబ్బారావు (ప్రముఖ అడ్వకేట్), కోశాధికారి ఎలుగూరి మధు (సీనియర్ ఆర్యవైశ్య సంఘ నాయకులు, ప్రముఖ వ్యాపారవేత్త), కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఇల్లందు ఆర్యవైశ్య మహాసభ మరియు వాసవి క్లబ్ ల సంయుక్త నిర్వహణలో రొంపేడు దగ్గరలోని సైదులు మామిడి తోట నందు ఆదివారం రాత్రి వరకు వనభోజన మహోత్సవ వేడుకలు ఎంతో ఘనంగా నిర్వహించబడ్డాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఇల్లందు మండల, పట్టణ, గుండాల ప్రాంతాల నుండి ఆర్యవైశ్యులు వేలాదిగా స్థానికంగా ఉన్న ఆర్యవైశ్యుల బంధు వర్గం కూడా పాల్గొన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా వన భోజనం మహోత్సవ కార్యక్రమానికి ఏర్పాటు చేసిన కమిటీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి గత వారం రోజులుగా పర్యవేక్షిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఏ ఒక్కరికి కూడా ఇబ్బంది రాకుండా అన్ని ఏర్పాట్లు దగ్గర ఉండి చూసుకున్నారు. మొదటి బంతిలో వడ్డించిన ప్రతి ఆహార పదార్థం చివరి బంతి వరకు ఎలాంటి లోటు లేకుండా ఆర్యవైశ్యులకు అందించడంలో కృషి చేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య కుటుంబాలన్నీ సపరివార సకుటుంబ సమేతంగా వనభోజన మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ వనభోజనాలలో సుమారు 1000 మంది ఆర్యవైశ్య సోదర, సోదరీమణులు పాల్గొని ఉదయం నుండి సాయంత్రం వరకు సత్యనారాయణ వ్రతం, వన్ మినిట్ గేమ్స్, సినీతంబోలా, మిమిక్రీ, మ్యాజిక్ షో, డాన్సులు లాంటి వివిధ రకాలైన వినోద కార్యక్రమాల మధ్య కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల నడుమ వారి సమయాన్ని ఎంతో సంతోషంగా గడిపారు. నిత్యం వ్యాపారంపై దృష్టి సారించేవారు ఆదివారం ఉల్లాసంగా గడిపారు. గత 15 రోజుల నుండి ఆర్యవైశ్య మహాసభ, వాసవి క్లబ్బుల ఆధ్వర్యంలో కండె రమేష్ అధ్యక్షులుగా, తాటిపల్లి సుబ్బారావు ప్రధాన కార్యదర్శిగా మరియు యెలుగూరి మధుబాబు కోశాధికారిగా ఒక కమిటీని ఏర్పాటు చేసుకుని ఆర్యవైశ్య కుటుంబాల అందరి సహకారం తీసుకొని ఈ వనభోజనాన్ని ఏర్పాటు చేశారు. ఈ వనభోజనాలు విజయవంతమైన సందర్భంగా నిర్వహణ కమిటీ వారు సహకరించిన ఆర్యవైశ్యులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ భవిష్యత్తులో కూడా ఆర్యవైశ్య మహాసభ, వాసవి క్లబ్ లు నిర్వహించే ప్రతి కార్యక్రమానికి ఇదే విధంగా తమ సహకారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. వన భోజనాలు విజయవంతం చేసినందుకు వనభోజన నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులకు ఇల్లందు మండల, పట్టణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు ప్రొద్దుటూరి నాగేశ్వరరావు, అర్వపల్లి రాధాకృష్ణ, వాసవి క్లబ్ అధ్యక్షులు పుల్లూరు సతీష్ కుమార్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఆర్యవైశ్య సంఘం వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఏ కార్యక్రమం నిర్వహించిన ఈ కమిటీ అత్యంత చురుకుగా పనిచేస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కండే రమేష్, తాటిపల్లి సుబ్బారావు, ఏలూగూరు మధు ముందుండి కార్యక్రమాలు విజయవంతం చేస్తారని చెప్పడం అందరికీ తెలిసిన విషయమే. రాబోయే కాలంలో కూడా ఏ కార్యక్రమం నిర్వహించిన ఇదే కమిటీ ముందుండి చేయాలని పట్టణ మండల ఆర్యవైశ్యులు కోరుతున్నారు

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- ఎస్ఓ టు జిఎండి శ్యాంసుందర్





**మణుగూరు నవంబర్ 18 నవభూమి ప్రతినిధి:** మణుగూరు మండలం తిర్లాపురంలో సింగరేణి ఆధ్వర్యంలో పండ్ల మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మణుగూరు ఏరియా ఎస్ ఓ టు జిఎం డి శ్యాంసుందర్ అన్నారు. సోమవారం సాయంత్రం మణుగూరు మండలం తిర్లాపురం బతుకమ్మ సెంటర్ లో ఏరియా జిఎం దుర్గం రామచందర్ ఆదేశానుసారం సింగరేణి పర్యావరణ విభాగం ఆధ్వర్యంలో గ్రామస్తులకు కొబ్బరి, మామిడి, జామ, పనస, నిమ్మ, బత్తాయి, సపోటా, 250 పండ్ల మొక్కల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పర్యావరణ పరిరక్షణకు సింగరేణి ఆధ్వర్యంలో మణుగూరు ప్రాంతంలో అనేక పండ్ల పూల మొక్కలు ఉచితంగా పంపిణీ చేయడం జరిగిందని ఎంతటి ఖర్చుకైనా వెనకాడకుండా ప్రతి సంవత్సరం నిరంతరాయంగా ఈ కార్యక్రమం కొనసాగు తోందని ఆయన తెలిపారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని ఆయన కోరారు. గ్రామ గిరిజన యువతి ఏనిక స్వరూప ఆధ్వర్యంలో మణుగూరు ఓసి ప్రభావిత గ్రామమైన తిర్లా పురం గ్రామస్తులకు ఉచిత మెడికల్ విటిసి శిక్షణ ఇప్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఉపాధి కూడా కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి (ఎండిఓ) శ్రీనివాస్ మణుగూరు ఓసి ప్రాజెక్ట్ అధికారి బి శ్రీనివాసచారి, మేనేజర్ బి రాజేశ్వరరావు, ఏరియా అధికార ప్రతినిధి ఎస్ రమేష్, ఏరియా పర్యావరణ అధికారి జె శ్రీనివాస్, సేఫ్టీ ఆఫీసర్ భాస్కర్, సతీష్, సింగరేణి సేవా సమితి సభ్యులు యస్ డి నా సర్ పాషా, గ్రామ పెద్దలు పాయం కామరాజు, జడ్పిటిసి లక్ష్మయ్య, పిసా కమిటీ అధ్యక్షులు మడి నరసింహారావు, స్వరూప, పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు.



## భక్తులు దాతల సహకారంతో అన్నదానం



**ఎర్రుపాలెం, నవభూమి, నవంబర్ 18 :** జమలా పురం గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర అన్నదాన సేవ సమితి ఆధ్వర్యంలో కార్తీక మాసం సందర్భంగా దాతలు భక్తుల సహకారంతో అన్నదాన కార్యక్రమం సోమవారం నిర్వహించారు.కార్తీక మాసం సందర్భంగా ప్రతి రోజు తమ సేవాసమితి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిస్తున్నట్లు సేవా సమితి సభ్యులు తెలిపారు.ఈ రోజు సోమవారం జమలాపురం గ్రామానికి చెందిన వెలిశెట్టి కృష్ణారావు-వాణిదంపతులు కుమారుడు,కోడలు వంశీ-భార్గవి దంపతుల వితరణతో అన్నదాన కార్యక్రమంనిర్వహించారు.దాతలు ముందుకు వచ్చి సహకరిస్తే ప్రతి రోజూవారి పేరుమీద భక్తులకుఅన్న దాన కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా నిర్వహిస్తా మని,అన్నంగోవిందం అన్నం పరబ్రహ్మ స్వరూపం అని అన్నదానం చేయటం వల్ల జమలాపురం వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు వారి కుటుంబాలపై వుంటా యని సేవా సమితి సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షురాలు కొడాలి విజయ లక్ష్మిదేవి, అధ్యక్షులు బొబ్బా కృష్ణ ప్రసాద్,ఉపాధ్యక్షులు యిమ్మిడి ఈశ్వర్ చంద్ర విద్యసాగర్,కార్యదర్శి ఎల్ వి నారాయణరెడ్డి,సహాయ కార్యదర్శి చింతా కిషోర్, కోశాధికారి వీరమాచనేని వెంకటకృష్ణ,మాజీ ఈవో అల్లూరు విష్ణుమూర్తి, కాకుమాను లీలాకృష్ణ, చొప్పవరపు శ్రీనివాసరావు, శ్రీ వేంక టేశ్వర సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు

## ఆ షోరూంకి వెళ్తే మీ కారు షెడ్డుకు వెళ్ళడం ఖాయం




**ఇల్లెందు రూరల్ నవంబర్ 18 నవభూమి ప్రతినిధి:** చిన్న చిన్న మైనర్ రిపేర్ ల కొరకు మీ కారు ను ఆ షోరూం కి తీసుకొని వెళ్తారా! ఇక అంతే మీ కారు సంగతి. పెద్ద పెద్ద సమస్యలతో మీరు ఇంటికి వెళ్ళాల్సిందే. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు శుభాష్ నగర్ కరెంట్ ఆఫీస్ ఏరియాలో మంచి పేరున్న కారు షోరూం బ్రాంచ్‌ను ఇటీవల ఏర్పాటు చేశారు. ఈ షోరూం లో కొత్త కార్ల అమ్మకాలతో పాటు సర్వీసింగ్ చేస్తారు. సర్వీసింగ్ కు ఇచ్చిన కార్లను ఇంటికి వచ్చిన తర్వాత చూసుకుంటే కొత్త కొత్త సమస్యలతో కారు యజమానులు లబోదిబోమని అనాల్సిందే. భారీ బిల్లు చెల్లించి ఇంటికి వచ్చిన తర్వాత, పెద్ద పెద్ద సమస్యలు కనిపిస్తే ఇదేమిటని మరలా షోరూం కు వెళ్తే మరలా బిల్లు మోత మోగుతుంది. కొత్తగా పెట్టిన షోరూం మేయింటెన్స్ వెళ్ళాలంటే ఇలాంటి బాదుడు బాదాల్సిందే కదా!

## కులగలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

### కులగలన సర్వేలో పాల్గొన్న మాజీ ఎంపీపీ ప్రియాంక శివశంకర్ గౌడ్ దంపతులు

**షాద్‌నగర్ నవభూమి ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగలన కార్యక్రమ సమీక్ష సమావేశం లో అన్ని కులాలకు న్యాయం జరగాలన్నదే ముఖ్యమంత్రిగారి ఆలోచన, దేశానికే ఆదర్శంగా నిలవనుంది ఈ కుల గణన కార్యక్రమానికి చేసే సర్వేలకు ప్రతి ఒక్కరూ సహకరించాలి అన్నారు.. నందిగామ చేగూర్ గ్రామంలో తన స్వగృహంలో నిర్వహించిన ఇంటికి కుంటుంబ సర్వేలో పాల్గొన్నారు.

# మానవ మనుగడకు శాస్త్రీయత మూలం

- వైభవంగా వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం
- ప్రదర్శనను ప్రారంభించిన ఎంపీ రామ సహాయం
- మానవ పరిణామ క్రమంలో తన మనుగడకు శాస్త్రీయతనే ఆధారంగా చేసుకున్నాడు
- దానితోనే అభివృద్ధి సాధ్యపడుతుందని పలువురు వక్తల భావన






**అన్నపురెడ్డిపల్లి నవంబర్ 18 నవభూమి ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి లోని విక్రమ్ అంబాలల్ సారాభాయ్ ప్రాంగణంలో మూడు రోజులపాటు జరుగుతున్న వైజ్ఞానిక ప్రదర్శనను సోమవారం ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామ్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణలు ప్రారంభించారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన ప్రారంభ సమావేశంలో విశిష్ట అతిధి పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురామ్ రెడ్డి మాట్లాడుతూ సైన్స్ అవగాహనతో మన ముందుండాలని దానితోనే అభివృద్ధి సాధ్యపడుతుందని అన్నారు. ఈ రోజులలో శస్త్ర చికిత్సలో సైతం రోబోలు పనిచేస్తున్నాయని, వ్యవసాయంలో డ్రోన్ల సహాయంతోనే నడుస్తుందని, ఇదంతా సైన్స్ అభివృద్ధికి సూచన అని అన్నారు. సభాధ్యక్షుడు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ విద్యార్థులలో శాస్త్రీయ అవగాహన పెంపొందించాలని దానికోసం ప్రత్యేక విజ్ఞాన ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని ఈ సంవత్సరంలో అశ్వరావుపేట నియోజకవర్గంలో నిర్వహించాలని జిల్లా విద్యాధికారి కోరగానే అన్నపురెడ్డిపల్లి లో ఏర్పాటు చేద్దామని చెప్పానని, నా మూలాలను మర్చిపోకుండా విద్యార్థులకు ఏదైనా చేయాలని తలచానని అందుకోసమే ఈ ప్రదర్శనను భారీ స్థాయిలో ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేశామని విద్యా, వైద్యం, ప్రధాన అజెండాగా తాను



పనిచేస్తున్నానని ఇప్పటికే ఐదు కోట్ల వ్యయంతో పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించామని, రెండు కోట్లతో వైద్య సదుపాయాల ఏర్పాట్లు చేస్తున్నామని,భావి భారత శాస్త్రవేత్తలను ఇక్కడి నుండే అందించాలని ఆలోచనతోనే ఈ వైజ్ఞానిక ప్రదర్శనను ఏర్పాటు చేశామని అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ ప్రపంచానికి శాస్త్రవేత్తల్ని అందించింది భారతదేశమని,సైన్స్ లేకుంటే ప్రగతి లేదని అందుకోసం విద్యార్థి దశలలోనే శాస్త్రీయ అవగాహన పెంపొందించుకోవాలని, ఇందుకోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. జిల్లా విద్యాధికారి ఎం వెంకటేశ్వర చారి మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో విద్యార్థులలో శాస్త్రీయ అవగాహన పట్ల అవగాహన కల్పించేందుకు ప్రతియటా ఈ ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని ఈసారి ఇక్కడ మూడు విభాగాలలో అనగా సీనియర్, జూనియర్, ఐటిడిఏ విభాగాలుగా భారీ స్థాయిలో ఎమ్మెల్యే సహాయంతో ప్రదర్శనను నిర్వహిస్తున్నామని ఇక్కడికి వచ్చిన ప్రదర్శనలలోని ప్రతి విభాగానికి ఏడుగురిని ఎంపిక చేసి మొత్తంగా 21 మందిని రాష్ట్రస్థాయికి పంపిస్తామని అన్నారు దీనితో పాటుగా ఇన్స్పైర్ ప్రోగ్రాం ద్వారా 76 ప్రాజెక్టను ఇక్కడ ప్రదర్శిస్తున్నామని అన్నారు. ప్రతి విద్యార్థికి పదివేల రూపాయలను ప్రాజెక్టు వ్యయముగా ప్రభుత్వం అందించిందని ఆ వ్యయంతో ప్రాజెక్టులను తయారు చేసుకొని ఇక్కడ ప్రదర్శిస్తున్నారని వాటి నుండి రాష్ట్రస్థాయికి ఎంపిక చేసి పంపిస్తామని అన్నారు. సామాజిక అవగాహనను పెంపొందించుకునేందుకు కూడా ఈ ప్రదర్శనలు దోహదం చేస్తాయని అన్నారు. ఈ ప్రదర్శనకు జిల్లా వ్యాప్తంగా 746 ప్రాజెక్టులు విద్యార్థులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సాంఘీక సంక్షేమ గురుకులాల జోనల్ అధికారి స్వరూప రాణి, జిల్లా సైన్స్ అధికారి చలపతి రాజు తదితరులు పాల్గొన్నారు.

# మనసుంటే మార్గం ఉంటది..నేస్తం వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్

- సేవే లక్ష్యం.... రాంకొండారెడ్డి
- పేద వాడికి చదువు, అనారోగ్యంగా ఉన్నవారికి ఆరోగ్యం అందించడమే మా గురి
- నేస్తం ట్రస్ట్ సభ్యులు





**బూర్గంపాడు నవంబర్ 18 నవభూమి:** బూర్గంపాడు మోరంపల్లి బంజర్ గ్రామానికి చెందిన నేస్తం వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ సోమవారం 13వ వార్షికోత్సవం సందర్భంగా ట్రస్ట్ సభ్యులు సమావేశం కావడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇప్పటి వరకు చేసిన సేవా కార్యక్రమాలు అలాగే భవిష్యత్ కార్యాచరణ గురించి చర్చించడం జరిగింది. అనంతరం సభ్యలందరూ కలిసి కేకు కట్ చేసి వార్షికోత్సవం శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ బత్తుల రామ కొండా రెడ్డి మాట్లాడుతూ పేదవారికి తమ వంతుగా సహయం అందించాలని ఉద్దేశ్యంతో 18 నవంబర్ 2011 న విద్య, వైద్యం, రక్తదానం లాంటి అంశాలకు ప్రాధన్యం కల్పిస్తూ ట్రస్ట్ ను ఏర్పాటు చేయడం జరిగింది. మనం చేసే సహాయం ఒక్కరితో ఆగిపోకుండా ఎంతో మందికి మన వంతు సహాయం చేయాలంటే మధ్య తరగతి కుటుంబం కు చెందినా మేము చేసే పరస్థితి వుండదు అందుకే మాలాంటి సహాయం చేయాలనే ఆలోచన వున్నా 13 మంది సభ్యులతో ఈ ట్రస్ట్ ను ఏర్పాటు చేసి ఈ రోజు వరకు మా మధ్య ఎలాంటి విభేదాలు లేకుండా 13 సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము. ఎంతో మంది పేద విద్యార్దులకు ఉన్నత చదువుల కోసం ఆర్దిక సహాయం అందించడం, వైద్య ఖర్చులకు కూడా ఆర్దిక స్థోమత లేక ఇబ్బంది పడుతున్నా పేదవారికి సహాయం చేయడం, ఆపదలో వున్నా వారికీ రక్త దానం చేయడం, ప్లాస్టిక్ నివారణ పర్యావరణ, పరిశుభ్రత లాంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు, విద్యార్దులను ప్రోత్సహించడానికి, మండల స్థాయిలో వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలను నిర్వహించడం, ప్రభుత్వ పాటశాలలో చదువులో రాణించే విద్యార్దులకు ప్రైజ్ మని ఇచ్చి ప్రోత్సహించడం, రక్తదానశిభిరాలు లాంటి ఎన్నో కార్యక్రమాలను గత 13 సంవత్సరాలుగా నిర్వహించడం జరిగింది. మా ట్రస్ట్ సభ్యులు అందించే సహకారంతో మరువలేనిది భవిష్యత్ లో కూడా ఈ సేవా కార్యక్రమాలను ఇలానే కొనసాగిస్తామని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ చింత అంకిరెడ్డి, సెక్రటరీ ఇండ్ల రాజేష్, కోశాధికారి కే రాజేందర్ రెడ్డి, సభ్యులు సంకా సురేష్, పేరం రామిరెడ్డి, డి బాల నారాయణరెడ్డి, అవుల నాగార్జున, కే రమేష్ రెడ్డి, ఆవుల శివ నాగిరెడ్డి, బిజ్జం వెంకట రామిరెడ్డి పాల్గొన్నారు.

# ప్రజావాణిలో దరఖాస్తులకు సత్వరమే పరిష్కారం: తాసిల్దార్ ఉషా శారద



**ఎర్రుపాలెం, నవభూమి, నవంబర్18:** ప్రజలు ప్రజావాణిలో ఇచ్చే దరఖాస్తులను వెంటనే పరిశీలించి పరిష్క రించేందుకు చర్యలు చేపట్టినట్లు తాసిల్దార్ మన్నే ఉషా శారద అన్నారు.ప్రజలు తమ తమ సమస్యలపై దరఖాస్తులు చేసి సమస్యలను పరిష్కరించు కోవాలని అన్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు ఈ ప్రజావాణి కార్యక్రమంలో తమ దరఖాస్తులను అందించాలని అన్ని శాఖల అధికారులు ఈకార్యక్రమం లో పాల్గొంటున్నారని,తమ సమస్యల పరిష్కారానికి ఈ ప్రజావాణి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.మండల ప్రజలు ప్రతి సోమవారం జరిగే ఈ ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జమలాపురం గ్రామానికి చెందిన బొబ్బ కృష్ణ ప్రసాద్ నాగార్జునసాగర్ కాలువల క్రింది భాగంలో ఉన్న పంట కాలువలను కొందరు రైతులు ఆక్రమించు కోవడంతో వర్షపు నీరు పంట పొలాలపై పడుతున్నదని ఆక్రమించుకున్న భూములను విడగొట్టి కాలువలు నిర్మించాలని తాసిల్దార్ కు వినతిపత్రం అందించారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐఎస్ రవికుమార్,ఐసిడిఎస్ సి డిపిఓకృష్ణ శ్రీ,నరేష్,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎంఆర్పియస్ మండల అధ్యక్షునికి మాతృ వియోగం



**జూలురుపాడు,నవంబర్ 18(నవభూమి ప్రతినిధి)** మండల ఎం ఆర్ పి యస్ మండల అధ్యక్షులు దెంబ్బెందుల సాయి కుమార్ మాతృమూర్తి లక్ష్మి సోమవారం మృతి చెందారు.సమాచారం తెలుసుకున్న అనేక మంది ప్రజల వివిధ పార్టీల నాయకులు, ఎం ఆర్ పి యస్,దళిత సంఘాల నాయకులు సామాజిక మాధ్యమాల వేదికగా నివాళులు అర్పించారు.వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

# రైతులకు సుస్థిర వ్యవసాయంపై అవగాహన సదస్సు

**చర్ల నవంబర్ 18 నవభూమి ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం సత్యనారాయణ పురం రైతు వేదికలో ఐటీసీ యం యస్ కే ( బంగారు భవిష్యత్తు ) వారి ఆధ్వర్యంలో మైరాడ యన్ జి ఓ మైరాడ సోషల్ మొబలైజర్ వి నవీన్ ఏ బి సి ట్రయినింగ్ రైతులకు ఇవ్వడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో రైతులకు సుస్థిర వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ ప్రతి ఒక్క రైతు ప్రతి నెల పొదుపు చేసుకోవాలని ఐటీసీ ఎమ్మెస్ కే బంగారు భవిష్యత్తు ఆధ్వర్యంలో మైరాడ సంస్థ ఇచ్చినటువంటి వస్తువులను డ్రమ్ సీడ్ సీడ్ డిల్లర్ రైతులు ఆధునిక పరిజ్ఞానంతో చేయాలని తక్కువ ఖర్చుతో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని రైతులకు వివరించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో దేవరపల్లి ఆర్. కొత్తగూడెం, సత్యనారాయణపురం, కలివేరు సింగ సముద్రం, రైతులు పాల్గొన్నారు. సొంది ధర్మరాజు, సుంకర వెంకటేశ్వర్లు, పొడియం గోపాలరావు, కణితి నరసింహారావు, పాయం రాములు, విసంపల్లి నరసింహారావు, అరుణ, సోయం అరవిందు, పి రమేష్, మైరాడ సోషల్ మొబలైజర్ నాగేశ్వరరావు, మైరాడ ఆగ్రోనామిస్ట్ షణ్ముఖ సాయి, రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.




# అదరహో ఆదివారం ఆదివాసీల సంత

■ **ఆదివాసీ జీవన మనుగడ సంతపై నవభూమి దినపత్రికలో ప్రత్యేక కథనం**







**మచ్చా రాజా / చర్ల నవంబర్ 18 నవభూమి ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం లోని తెలంగాణ ఛత్తీస్గడ్ సరిహద్దు ఏజెన్సీ ప్రాంతమైన చర్ల మండల కేంద్రంలో ప్రతి ఆదివారం జరిగే వారపు సంతలో ఆదివాసీలదే కీలకం. అడవిలో పండించే ఎరువులు లేని కూరగాయలు ప్రత్యేకం. మోసంలేని తూకం వారికే సొంతం.! ఆదివాసీల సంతకు సౌకర్యాలు కల్పించాలి. అడవి తల్లిని నమ్ముకొని తరతరాలుగా ప్రకృతిలో సహజ సిద్ధంగా లభించే ఆహారాన్ని తీసుకుంటూ ఆరోగ్యంగా ఆదర్శంగా జీవిస్తున్న ఆదివాసీలు. వారి పెరట్లో లభించే సహజ సిద్ధమైన కూరగాయలను పండించాలని చిన్న ఆలోచన. ప్రతి ఆదివారం చర్ల సంతలో ఉదయం 9 నుండి 11 గంటల వరకు ఎటువంటి కెమికల్ మందులు వాడని కూరగాయలు మొదలగు ఆహార పదార్థాలు అమ్ముతారు. వీరంతా పూసుకుప్ప, తిప్పాపురం, చెన్నాపురం, కుర్నపల్లి, బోధనెల్లి, కుర్కట్పాడు, కొత్తూరు, కొత్తపల్లి, కొంపల్లి, జిపి పల్లి, గీసరెల్లి, బి కొత్తూరు, చతిస్గడ్ రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలనుండి మర్మం మోసం తెలవని ఆదివాసీలు వారి ఇంటి పెరట్లోనే తింటానికి పండించుకునే కూరగాయల పంటలను జీవనోపాధి కోసం చర్ల పట్టణ ప్రాంతంలో కొద్దికొద్దిగా అమ్ముకుంటూ చేతగా జీవనోపాధి కల్పించుకుంటూ క్రమక్రమంగా ఆ సంఖ్య పెరుగుతూ ఆదివాసి సంతగా ఆవిర్భవించింది. ఓవైపు ఆరోగ్యం, మరోవైపు నాణ్యమైన తూకానికి అందిస్తూ అధరహో అనేలాగా విస్తరిస్తున్న ఆదివాసి సంతపై **నవభూమి దినపత్రికలో ప్రత్యేక కథనం..!** రోజురోజుకి పెరుగుతున్న ప్రపంచికరణలో అంతకంతకు పెరుగుతున్న వ్యాపార పోటీలో నాణ్యత గాలికి వదిలేసి ఎరువులు పురుగు మందులతోనే పంటలు పండించడమే కాక చంటి పిల్లలు తాగే పాల నుండి ప్రతీది కల్తీ అవుతున్నాయి. ఇలాంటి రోజులలో ఆరోగ్యం కోసం ఆలోచించే వారిని లక్ష్యంగా చేసుకొని సేంద్రీయ పంటల పేరుతో వ్యాపారాలు ప్రారంభమవుతున్న తరుణంలో ఎటువంటి ఎరువులు పురుగులు మందులు వాడకుండా సహజ సిద్ధంగా పండించే నాణ్యమైన కూరగాయలు ఆకుకూరలతో పాటు పండ్లు, జొన్నలు, పప్పు దినుసులు, ఆదివాసీలు సహజంగా వినియోగించే తేనెలు, తునికి పళ్ళు, మురళి పళ్ళు వంటి సహజ పంటను పట్టణవాసులకు అందించేందుకు చర్ల లో ఆదివారం రోజు జరిగే గాంధీ బొమ్మ సెంటర్ నుండి గ్రామపంచాయతీ వెళ్లే దారిలో మనకు రోడ్డుపై కనువిందు చేస్తాయి. ఆదివాసీలు తెచ్చే సరుకుల పట్ల పట్టణవాసులు ఆసక్తి అంతకంతకు పెరుగుతుంది. తెచ్చుకున్న కూరగాయలను ఒకే మాట ఒకే రేటుగా నిర్ణయించుకొని మోసం లేకుండా స్వతహాగా వారి చేతితోనే పోగులుగా ఏర్పాటు చేసి మార్కెట్ ధరలతో సంబంధం లేకుండా అతి తక్కువ లాభాపేక్షతో విక్రయించడం వీరి ప్రత్యేకత. తెచ్చుకున్న సరుకులు అమ్ముకొని వచ్చిన డబ్బుతో కావలసిన వస్తువులను కొనుక్కొని తిరిగి వారి గ్రామాలకు వెళ్తూ వారి జీవన ఉపాధి పొందటమే కాకుండా అందరికీ ఆరోగ్యాన్ని అందిస్తున్నారు. ప్రకృతి అందాలకు సహజ వనరులకు నిలయమైన ఏజెన్సీ ప్రాంతంలో చర్ల పట్టణ ప్రాంతాల నుండి ఎంతోమంది ప్రత్యేకంగా సంతకు వెళ్లి ఆదివాసులు విక్రయించే సహజ సంపదను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపటం మనకు తెలిసిందే. ఈ నేపథ్యంలో వారంతో పని లేకుండా ఆదివాసీ ప్రాంతాల నుండి సహజంగా పండే పంటను చర్ల పట్టణంలో ప్రతిరోజు అందుబాటులోకి తీసుకురావడంతో ఎటువంటి ప్రచార ఆర్భాటాలు లేనప్పటికీ ఉదయం 7 గంటల నుండి11 గంటల వరకు స్థానిక ప్రజలతో కిటకిటలాడుతున్న ఆదివాసి సంత పట్ల అధికారుల దృష్టి పెట్టి అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.





**ఆదివాసి సంతకు మౌలిక సదుపాయాలు కల్పించాలి:** లయన్స్ క్లబ్ అధ్యక్షులు నీలి ప్రకాష్ ఏజెన్సీ గ్రామాల నుండి సహజసిద్ధంగా లభించే కూరగాయలను ఆకుకూరలను పండ్లు నీ ఇతరితర పలు వస్తువులను అతి తక్కువ ధరకే చర్ల పట్టణ ప్రజలకు అందిస్తున్న ఆదివాసీలను ప్రభుత్వం ఆదుకోవాలి. ఉదయం 7 గంటల నుండి 11 గంటల వరకు ఈ సంత నిర్వహిస్తున్న ఆదివాసీలకు మరుగుదొడ్లు, త్రాగునీరు సదుపాయం ఏర్పాటు చేయాలని అన్నారు. మారుతున్న కార్పొరేట్ రోజులలో ప్రతీది కలుషితమైపోయి తినే ప్రతి వస్తు విషపూరితమవుతున్న రోజులలో ఎటువంటి ఎరువులు పురుగుమందులు లేకుండా సహజంగా పండించిన పంటను మనకు అందిస్తున్న ఆదివాసీలను అభినందించడంతో పాటు ఆదరిస్తూ ఈ సంత అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉంది. ఆదివాసి సంఘాల నాయకుడు ఇర్పా రాజు మాట్లాడుతూ తెలంగాణ ఆంధ్ర చత్తీస్గడ్ రాష్ట్రాలలో ఆదివాసీలు కీలకంగా ఉంటారని, కల్మషం లేని మంచి మనసు కలిగి అడవి తల్లి ప్రకృతిలో ఆహ్వాదిస్తూ నిత్యం ఆరోగ్యంతో ఎంతో దృఢంగా ఉంటూ ప్రకృతి ఒడిలో సహజ సిద్ధంగా పండించే పంటను మాత్రమే తింటారని, దంపుడు బియ్యం సురవడ్లు, ఇప్ప పూలు, అడవి నుండి వచ్చే ప్రతి వస్తువు ఆదివాసీలకి ఉపాధి కల్పిస్తుందని అడవిని నమ్ముకునే ఆదివాసీలకు ఈ ప్రభుత్వాలు పూర్తి రక్షణ కల్పించాలని, ఆదివాసీలు సొంతంగా పండించుకునే ఇటువంటి పాడిపంటలను పట్టణ ప్రజలందరూ ఆదివాసి జీవనగడకు సహకరించాలని అన్నారు.

# అథ్లెటిక్స్ ఛాంపియన్ కరీంనగర్ జట్టు

**ఖమ్మం-నవభూమి:** అండర్-14 రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు ఆదివారం ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో ముగిశాయి. ఓవరాల్ ఛాంపియన్ షిప్ కరీంనగర్ జిల్లా జట్టు గెల్చుకొంది.

బాలుర విభాగంలో ఆదిలాబాద్, బాలికల విభాగంలో కరీంనగర్ జట్లు అగ్రస్థానంలో నిలిచాయి. అధికారులు సోమశేఖరశర్మ, సునీల్‌రెడ్డి విజేతలకు బహుమతు లు అందజేశారు.

రాష్ట్ర అండర్ 14 అథ్లెటిక్స్ జట్టు: జాతీయ స్థాయి అండర్-14 అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే తెలంగాణ బాలబాలికల జట్ల వివరాలను పాఠశాల క్రీడల కార్యదర్శి నర్సింహమూర్తి ప్రకటించారు. బాలుర జట్టులో జిల్లాకు చెందిన బి.నరేష్ లోకేశ్, బాలికల జట్టులో వై.శ్రుతిహాసన్ .. ఇతర జిల్లాల క్రీడాకారులున్నారు.

# శ్రీకృష్ణ పాండవ ఉత్సవ వేడుకలలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నేత ఇంగువ రమేష్





**బూర్గంపాడు నవంబర్ 18 నవభూమి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం మోతే గ్రామంలో శ్రీ కృష్ణ పాండవ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. 16న గుంట, 17 నంది ఊరేగింపు కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. 18న గొంతెనమ్మ నిమజ్జనం భక్తిశ్రద్ధలతో జై జై ఘనాల మధ్య భాజా భజేంద్రుల తో కన్నుల పండుగ నిర్వహించారు. 18న అన్నదాన కార్యక్రమం ఘనంగా జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సారపాక గ్రామానికి చెందిన ఇంగువ రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆయనకు ఘనంగా గ్రామస్తులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి మంచి కార్యక్రమానికి తన ఆహ్వానించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన చేతుల మీద ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రహీంఖాన్, కృష్ణ, మోతీరు గ్రామంలోని పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# లైసెన్స్ లేకుండా పంటలు కొనుగోలు చేస్తే చర్యలు



**కారేపల్లి,నవభూమి, నవంబర్18 :** ట్రేడింగ్ లైసెన్స్ ఉన్న వ్యాపారులు మాత్రమే రైతుల వద్ద నుండి పంటలు కొనుగోలు చేయాలని లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, కార్యదర్శి నరేష్‌లు ఉన్నారు. సోమవారం కారేపల్లి సినిమా హాల్ ప్రాంగణంలో కారేపల్లి, కామేపల్లి మండలాలకు చెందిన వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ ప్రతి వ్యాపారి లైసెన్స్‌తోనే వ్యాపారం చేయాలన్నారు. లైసెన్స్ లేని వారు వెంటనే లైసెన్స్ కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామాలలో అనాధికార కొనుగోళ్లపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తామన్నారు. రైతులు మోసకుండా ప్రభుత్వం సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. రైతు క్వింటా పత్తి తీసుకవచ్చిన సీసీఐ కొనుగోలు కేంద్రంలో కొనుగోలు చేస్తామన్నారు. ఇప్పటికి కారేపల్లి సీసీఐ కేంద్రంలో 6వేల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేయటం జరిగింది. కొనుగోలు చేసిన పత్తికి రైతుల బ్యాంకు ఖాతాలలో పైకం జమ అయిందన్నారు. ఈకార్యక్రమంలో మార్కెట్ డైరర్లు గప్రునాయక్, బావుసింగ్, సిబ్బంది మున్నీర్ తదితరులు పాల్గొన్నారు.

# టాయిలెట్స్ లేక సిపిఎస్ టీచర్స్, విద్యార్థుల అవస్థలు

- బూతు బంగ్లాగా పాఠశాల బాత్ రూమ్స్
- టాయిలెట్స్, పాఠశాలలో మంచి నీళ్ళు లేవు
- కనీసం గోడకు సున్నం లేదు
- సిబ్బంది తక్కువ పనులు నత్తనడక
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ఈ ఏడాదైనా పూర్తయ్యేనా
- పట్టించుకోని అధికారులు ప్రజాప్రతినిధులు






**గుండాల నవంబర్ 18 నవభూమి:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎక్కువ మంది టీచర్స్ లేడీస్ కావడంతో టాయిలెట్స్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనులను దక్కించుకున్న కాంట్రాక్ట్ నత్త నడకన పనులు చేస్తూ నేటికి పూర్తి కాలేదు. మన ఊరు మన బడి పథకం లో ఉపాధి హామీ పథకం నుండి రూ. 25 లక్షలు మంజూరు అయ్యాయి. ప్రహరీ గోడ టాయిలెట్స్ కిచెన్ నిర్మాణానికి25లక్షలు మంజూరు చేసి అసంపూర్తిగా నిర్మాణం చేసి తూతూ మంత్రాంగ చేతులు దులుపుకొన్నారు. గుండాల ప్రాథమిక పాఠశాల టీచర్స్ టాయిలెట్స్ కు పక్కనే ఉన్న బాలికల హాస్టల్ కు వెల్లుతున్నారు. అంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక విద్యార్థులు టాయిలెట్స్ బాత్ రూమ్స్ లేక ఊరు బయటికి వెల్లుతున్నారు. బహిరంగ మూత్ర విసర్జన కు పాల్పడుతున్నారు.కొంత మంది విద్యార్థులు ఇంటికి పోయి వస్తున్నారు. కనీసం మంచి నీళ్ల బోరు కూడా లేదు. విద్యార్థులు దాహం వేస్తే పక్కనే ఉన్న హైస్కూలు లో ఉన్న మంచి నీటి బోరు దగ్గరకు వెల్లుతున్నారు. మండలంలో మొత్తం 50 స్కూళ్లకు పైగా సర్కార్ స్కూల్ ఉండడంతో అందులో టాయిలెట్ ఉన్న దగ్గర నీటి సౌకర్యం లేదు. నీటి సౌకర్యం ఉన్న దగ్గర టాయిలెట్ పూర్తి కాలేదు. ఈ రెండు పూర్తయిన దగ్గర కరెంటు సౌకర్యం లేదు. ఇలా సర్కారు స్కూళ్లలో సమస్యలు ఉన్న సంబంధిత ఎంఈఓలు పర్యవేక్షణ లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా గుండాల మండల కేంద్రంలో 60సంవత్సరాలు చరిత్ర కలిగిన ఈ పాఠశాల లో నేడు బాత్ రూమ్స్ టాయిలెట్స్ లేక విద్యార్థులు ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. మంజూరు అయిన రూ. 25 లక్షల్లో ప్రహరీ గోడ నిర్మించారు. కిచెన్ నాణ్యత లేకుండా అసంపూర్తిగా చేశారు. బాత్ రూమ్స్ టాయిలెట్స్ అసలు కట్టలేదు. నీళ్లు లేవు. ఇంత ఘోరంగా మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాల నడుస్తున్నప్పటికిని జిల్లా ఉన్నత అధికారులు ప్రజాప్రతినిధులు ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా ఉండటం పై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మంజూరు అయిన రూ. 25 లక్షల పనులపై విచారణ జరిపించాలని, పాఠశాలలో బాత్ రూమ్స్ టాయిలెట్స్ కట్టించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. లేకపోతే జిల్లా కలెక్టర్ కు పిర్యాదు చేస్తాం అని తల్లిదండ్రులు అంటున్నారు

# సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- ప్రజావాణిలో వినతులను స్వీకరించిన జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్‌లు

**ఖమ్మం కలెక్టరేట్, నవభూమి, నవంబర్ 18:** ప్రజావాణిలో తమ సమస్యలు తెలుపుతూ ప్రజలు సమర్పించిన దరఖాస్తుల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి, శిక్షణ సహాయ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ లతో కలిసి ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యత నిచ్చి సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని అన్నారు. బోనకల్ మండలం మొటమర్రి గ్రామానికి చెందిన మరీదు వెంకన్న తమది చాలా నిరుపేద కుటుంబమని, తన పాప చదువుకు ఆర్థిక భారం అవ్వకుండా మహాత్మ జ్యోతి బా పూలే రెసిడెన్షియల్ స్కూల్ నందు ఆరవ తరగతిలో సీట్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఆర్.సి.ఓ., బీసీ సంక్షేమ అధికారికి రాస్తు పరిశీలించి చర్యలు తీసుకోవాలని అన్నారు. నేలకొండపల్లి మండలం చెరువుమాధారం గ్రామానికి చెందిన ఎస్.కే. పాషా తాను ఎం.ఎల్.టి, డిప్లొమా ఇన్ మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ చదువుకున్నానని, ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నందున తనకు ఏదో ఒక ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారికి రాస్తూ పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు. రఘునాధపాలెం మండలం పువ్వాడ ఉదయ నగర్ కాలనీకి చెందిన యర్రం ఉమాదేవి తన భర్త కృష్ణకు రెండు కిడ్నీలు క్షీణించి మరణించారని, తనకు వితంతు పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఎం. రాజేశ్వరి, డిఆర్డీవో ఎస్. సన్యాసయ్య, కలెక్టరేట్ ఏవో అరుణ, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.









## 25న జాస్తిపల్లిలో అయ్యప్పల ఇరుముడి మహోత్సవాన్ని విజయవంతం చేయండి-రాయల వీరన్న స్వామి



**కామేపల్లి, నవభూమి, నవంబర్ 18 :** కామేపల్లి మండలం జాస్తిపల్లి గ్రామంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవాలయంలో ఈనెల 25న ఉదయం 7.18 నిమిషాలకు అయ్యప్పల ఇరుముడి మహోత్సవంను రాయల నరేష్ గురు స్వామి, రాయల వెంకటేశ్వర్లు గురుస్వామి ఆధ్వర్యంలో రాయల నాగయ్య గురు స్వామి సారధ్యంలో నిర్వహిస్తున్నట్లు కన్నె స్వామి రాయల వీరన్న స్వామి సోమవారం తెలిపారు. అయ్యప్ప భక్తులు, బంధుమిత్రులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు ప్రచారం కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహోత్సవ కార్యక్రమం విజయవంతం కొరకు ఇప్పటినుండి అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తున్నట్లు వెల్లడించారు.కాగా గ్రామంలో అయ్యప్ప దీక్షపరులు సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిత్య పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణంతో పాటు పండుగ వాతావరణం సంతరించుకుంది. అయ్యప్ప నామస్మరణతో జాస్తిపల్లి గ్రామం మారు మోగిపోతుంది. గత ఏడాది కంటే ఈ ఏడాది గ్రామంలో దీక్ష చేపట్టిన భక్తుల సంఖ్య ఘనంగా పెరిగింది.

## అధికారుల పర్యవేక్షణాలోపంతో ప్రజాధనం వృధా

### ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తీవ్ర ఆగ్రహం



**కొత్తగూడెం నవంబర్ 18 నవభూమి ప్రతినిధి:** మున్సిపాలిటీ పరిధిలోని 21వ వారు మేదరబస్తీలో నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నిర్మించిన డ్రైనేజి ధ్వంసం అవడంతో స్ధానికుల ఫిర్యాదుమేరకు కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు సోమవారం ధ్వంసమైన డ్రైనేజీని పరిశీలించారు. డ్రైనేజి పునర్నిర్మాణంకోసం సత్వరమే చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. డ్రైనేజి దుస్థితిపై మున్సిపల్ శాఖ అధికారులను మందలించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ నిర్మాణంలో నాణ్యత లోపించడం వల్లే డ్రైనేజి ధ్వంసమైందని, ఇది ముమ్మాటికీ అధికారుల్లో పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ల అవినీతికి పాల్పడటం వల్లే లక్షలాది రూపాయల ప్రజాధనం వృధా అయిందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ఎలాంటి లోపాలు జరిగినా ఉపేక్షించేదిలేదన్నారు. కూనంనేని వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మున్సిపల్ కమిషనర్ శేషాంజన్ స్వామి, అధికారులు వున్నారు

## ప్రభుత్వ వరి కొనుగోలు కేంద్ర పరిశీలన

**షాద్‌నగర్ నవభూమి ప్రతినిధి :** ఫరూఖ్ నగర్ మండలం ఎలికట్ట గ్రామంలో షాద్ నగర్ వ్యవసాయ సహకార శాఖ వారు నిర్వహిస్తున్నట్టువంటి ప్రభుత్వ వరి కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయ అధికారి నిశాంత్ కుమార్ సోమవారం పరిశీలించడం జరిగింది.

# నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- సన్నరకం ధాన్యానికి క్వింటాల్ కు 500 రూపాయల బోనస్
- కొనుగోలు ధాన్యం వివరాలు ఎప్పటికప్పుడు ఓపిఎంఎస్‌లో నమోదు
- కూసుమంచి మండలం పాలేరు గ్రామంలో సన్న రకం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్







**ఖమ్మం/కూసుమంచి, నవభూమి,నవంబర్ 18:** కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వెంటనే ధాన్యం నాణ్యత ప్రమాణాలు పరిశీలించి కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కూసుమంచి మండలం పాలేరు గ్రామంలో సన్న రకం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, శిక్షణ సహాయ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠలతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోనుగోలు కేంద్రాలకు వచ్చిన రైతులతో ఎన్ని ఎకరాలలో పంట సాగు చేశారు, ఎంత దిగుబడి వచ్చింది, కొనుగోలు కేంద్రాలకు పంట తెచ్చి ఎన్ని రోజులు అవుతుంది, తేమ శాతం ఎంత ఉంది, టార్పాలిన్ కవర్లు ఇస్తున్నారా, మొదలగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాలలో సన్న రకం ధాన్యం కొనుగోలు రిజిస్టర్ లను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన మేర గన్ని బ్యాగులు, టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచామని అన్నారు. వర్షాభావ పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉంటూ పంటకు టార్పాలిన్ కవర్లు కప్పాలని కలెక్టర్ తెలిపారు. గన్ని సంచులు నాణ్యతను కలెక్టర్ పరిశీలించారు. డెలివరీ సమయంలో నాణ్యతను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. నాణ్యత తక్కువ, చిరిగి ఉన్న గన్ని సంచులు వినియోగించవద్దని, సరఫరా చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. పాలేరు ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఇప్పటి వరకు 99 మంది రైతుల వద్ద నుంచి పంట కొనుగోలు పూర్తి చేశామని అన్నారు. తేమ రాగానే వడ్లకు కాంటా వేయాలని, కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఎప్పటి కప్పుడు ఓపిఎంఎస్ లో నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం ప్రత్యేకంగా క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ప్రకటించిందని, ఇది ప్రత్యేకంగా రైతుల ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని అన్నారు. ధాన్యం అమ్మే సమయంలో రైతులు సమర్పించిన బ్యాంకు ఖాతాల్లో బోనస్ డబ్బులు పడ్తాయని అన్నారు. మద్దతు ధరపై నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసిన వెంటనే సంబంధిత మిల్లులకు తరలించాలని, ఎటువంటి ఆలస్యం జరగడానికి వీలు లేదని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ తనిఖీలలో జిల్లా కలెక్టర్ వెంట ఐ.కె.పి. ఇన్చార్జి కొత్త జ్యోతి, ఏ.పి.ఎం. సత్యవర్ధన్ రాజ్, ఏ.ఓ. రామడుగు వాణి, రైతులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన - విజయోత్సవాల వేడుకలను విజయవంతం చేయాలి

- కలెక్టర్ జితేష్ వి. పాటిల్




**కొత్తగూడెం నవంబర్ 18 నవభూమి ప్రతినిధి:** ప్రభుత్వం ఏర్పడి తొలి ఏడాది కాలంలో సాధించిన విజయాలు చేపట్టిన కార్యక్రమాలు వివిధ పథకాలను విస్తృతంగా ప్రజల్లో కి తీసుకు వెళ్ళుటకు గాను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ప్రజా పాలన - ప్రజా విజయోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయాలనిజిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈనెల 19న వరంగల్ లో నిర్వహించు ప్రజా పాలన - విజయోత్సవాల వేడుకలకు జిల్లా నుండి మహిళా సంఘాల మహిళలను భాగస్వాములు చేయుటకు గాను చేయాల్సిన ఏర్పాటలపై జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన తో ఎంపీడీవోలు, ఆర్టీసీ అధికారులు మరియు సంబంధిత అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా 19వ తారీఖు వరంగల్ వేదికగా 22 జిల్లాల్లో ఇందిరా మహిళా శక్తి భవనాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన కార్యక్రమానికి మరియు ప్రజా పాలన విజయోత్సవ వేడుకలకు జిల్లా నుండి పెద్ద ఎత్తున మహిళలను తీసుకువెళ్లాలని అధికారులు ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నుండి పెద్ద ఎత్తున మహిళా సంఘాల సభ్యులను ప్రజా పాలన విజయోత్సవాల వేడుకలకు హాజరు అయ్యేలా ప్రణాళికలు చేపట్టాలన్నారు.జిల్లా నుండి 12 బస్సుల్లో బస్సు కు 45 మంది చొప్పున 540 మంది మహిళలను కార్యక్రమంలో పాల్గొనాలని అన్నారు. దూరంగా వున్న మండలా బస్సులు ఉదయం ఏడు గంటలకు, మిగిలిన మండలాల బస్సులు ఎనిమిది గంటలకు మండల కేంద్రం నుండి బయలుదేరాలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పాల్గొనే మహిళలందరికీ ఐడీ కార్డులు అందించాలని, అదేవిధంగా ప్రతి ఐడి కార్డు వెనకాల సంబంధిత ఏపిఎం ఫోన్ నెంబర్లు ఉండాలని అధికారులను సూచించారు. కార్యక్రమానికి హాజరైన మహిళలకు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. బస్సుల్లో మహిళలకు త్రాగునీరు, అల్పాహారం ఏర్పాటు చేయాలని అన్నారు. అన్ని బస్సులు ఒకే రూట్లో వరంగల్ చేరుకునేలా రూట్ మ్యాప్ ను సిద్ధం చేయాలన్నారు. బస్సులన్నిటికీ బ్యానర్లు సిద్ధం చేయాలి అన్నారు. మహిళలకు నర్సంపేటలో మధ్యాహ్నం మరియు రాత్రి భోజనం సౌకర్యాలు ఏర్పాటు చేయాలని దానికి తగిన చర్యలు చేపట్టాల్సిందిగా అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పాల్గొనే మహిళల అందరి వివరాలు మరియు ఫోన్ నెంబర్లు నమోదు చేయాలన్నారు. అన్ని మండలాల్లోనే ఏపీఎంలు తమ పరిధిలోని ఉత్సాహవంతులైన మహిళా గ్రూపు సభ్యులను గుర్తించి ఈ కార్యక్రమానికి తీసుకురావాలని అన్నారు. మహిళలు కేవలం కార్యక్రమంలో పాల్గొనటం మాత్రమే కాకుండా అక్కడ వివిధ జిల్లాలు వారు ఏర్పాటుచేసిన స్టాల్ లను చూడడం ద్వారా మన జిల్లాలో కూడా ఆ ఆలోచన లు అభివృద్ధి చేసే అవకాశం ఉంటుందన్నారు.ఆర్టీసీ అధికారుల ను మహిళల తరలింపుకు అవసరమైన బస్సుల వివరాలు అందించాలని ఆదేశించారు. అన్ని మండలాల ఏపిఎం లు మరియు సీసీలు కార్యక్రమం అనంతరం మహిళలు ఎవరు మిగిలిపోకుండా అందరిని గమ్యస్థానాలకు చేర్చేలా చర్యలుచేపట్టాలని ఆదేశించారు. మహిళలు గమ్యస్థానం చేరుకునేంతవరకు వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు.మహిళలందరూ పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు.

# మాకొద్దు మాకొద్దు ఈ సెక్రటరీ మాకొద్దు



**రుద్రంపూర్ నవంబర్ 18 నవభూమి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం ధన్బాద్ గ్రామపంచాయతీ సెక్రటరీ ఉపేందర్ ను తొలగించి విద్యావంతుడైన సెక్రటరీని నియమించాలని ప్రజలు కోరుతున్నారు. సర్పంచుల కాల పరిమితి తీరగానే ప్రభుత్వం సెక్రటరీని, ప్రత్యేక అధికారిని నియమించిన సంగతి తెలిసిందే. అయితే సెక్రటరీ ఉపేందర్ గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేయించకుండా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. పారిశుద్ధ్య పనులు చేయించకపోవడం వీధిలైట్లు వేయించకపోవడం, మిషన్ భగీరథ నీటిని కూడా ప్రజలకు అందించకపోవడం, ఎలాంటి కార్యక్రమాల్లో కూడా సహకరించకపోవడం ఇతని నైజం. ఇదేంటని అడిగిన వాళ్లపై కేసులు పెడతానని బెదిరింపులకు పాల్పడడం, నేను చెప్పిందే వినాలి అంటూ తన క్రూరత్వాన్ని చూపిస్తుంటాడు. వయసు పై పడిన వారిపై కూడా సభ్యత సంస్కారం లేకుండా మాట్లాడడం ఇతను తీరు ప్రతి ఒక్కరిని ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఇలాంటి సెక్రటరీ మాకొద్దు అంటూ ప్రజలు వారి ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు ఉన్నత అధికారులకు సెక్రటరీ ఉపేందర్ గురించి ఆధారాలతో ఫిర్యాదు చేసిన ఫలితం లేదని వాపోతున్నారు. ఇతను ఇలాగే ఈ సెక్రటరీ హోదాలో కొనసాగితే మా గ్రామం అభివృద్ధి చెందకపోగా రోగాలతో చిన్న పెద్ద ముసలి ముతక అందరూ అనారోగ్య బారిన పడతారని అభిప్రాయపడుతున్నారు. వెంటనే ఈ సెక్రటరీని తొలగించి మరో విద్యావంతుడైన సెక్రటరీని నియమించాలని ప్రజలు కోరుతున్నారు

# రెజొనెన్స్ శ్రీనగర్ విద్యార్థుల పిక్నిక్




**ఖమ్మం నవభూమి నవంబర్ 18:** స్థానిక శ్రీనగర్ కాలనీలోని రెజొనెన్స్ స్కూల్ విద్యార్థుల విహారయాత్ర మరియు కార్తీకమాస వనసమారాధనను పాఠశాల డైరెక్టర్స్ కొండా శ్రీధర్రావు, కొండా కృష్ణవేణి విద్యార్థుల కేరింతల నడుమ భక్తి ప్రపత్తులతో ఘనంగా ప్రారంభించి నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమములో స్కూల్ డైరెక్టర్ కొండా శ్రీధర్రావు పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మకతను, మానసికోల్లాసాన్ని పెంపొందించే ఉద్దేశ్యంతో చెరుకూరి గార్డెన్స్లో విహారయాత్రను నిర్వహించామని, కార్తీక మాసంలో ఇలాంటివి ఏర్పాటుచేయడం ఎంతో సంతోషాన్ని ఇస్తుందని, విద్యార్థులను తరగతి గదులకే పరిమితం చేయకుండా శారీరక, మానసిక ఉల్లాసం కోసం, కలసిమెలసి ఉండటం, ప్రకృతిని ఆరాధించటం వంటి విషయాలపై అవగాహన కల్పిస్తూ ప్రత్యక్ష అనుభూతి కోసం రెజొనెన్స్ స్కూల్ వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తుందని తెలియజేస్తూ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కొండా కృష్ణవేణి పాల్గొని, మాట్లాడుతూ రెజొనెన్స్ స్కూల్ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా నాణ్యమైన విద్యతోపాటు పిక్నిక్ లు, ఫీల్డ్ ట్రిప్ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ నిరతంరం మంచి ప్రణాళికలతో విద్యార్థులను విజ్ఞానవంతులుగా చేస్తున్నామని తెలియజేస్తూ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయులు చిన్నారులకు వివిధ రకాల క్రీడలను నిర్వహించారు. స్వేచ్ఛా ప్రపంచంలోకి అడుగుపెట్టిన పిల్లలు ఉత్సాహంతో కేరింతలు కొట్టారు. పిల్లలు ప్రదర్శించిన నృత్యాలతో, ఆటపాటలతో, కార్యక్రమం ఆధ్యంతం ఆనందభరితంగా, ఎంతో ఉల్లాసంగా సాగింది. ఆటలలో గెలిచిన విద్యార్థులను అభినందించారు.

ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, ఉపాధ్యేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## సింగరేణిలో కార్బన్ డయాక్సైడ్ నుండి

# మిథనాల్ తయారీ ప్లాంట్ ఏర్పాటు

- దేశంలోనే తొలి ప్రయోగాత్మక ప్లాంట్
- రోజుకు 500 కేజీల కార్బన్ డయాక్సైడ్ నుండి
- 180 కేజీల మిథనాల్ తయారీ
- కోల్ ఇండియా - ప్రైవేట్ సంస్థలతో కలిసి ఏర్పాటు
- ప్రయోగం సఫలం అయితే భారీ మిథనాల్ యూనిట్ స్థాపనకు సంసిద్ధం
- డిసెంబరు 31 నాటికి పూర్తి : సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్







**కొత్తగూడెం నవంబర్ 18 నవభూమి ప్రతినిధి:** పర్యావరణహిత చర్యలకు పెట్టింది పేరుగా ఉన్న సింగరేణి సంస్థ మరో వినూత్న వ్యాపార విస్తరణ ఆవిష్కరణకు రంగం సిద్ధమైంది. దేశంలోనే మొట్టమొదటిసారిగా కార్బన్ డయాక్సైడ్ వాయువు నుంచి మిథనాల్ ను ఉత్పత్తి చేసే ప్రయోగాత్మక ప్లాంటును సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం ఆధారంగా కంపెనీ ఏర్పాటు చేస్తోంది. సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రంలో బొగ్గును మండించగా వెలువడే వాయువు నుండి రోజుకు 500 కేజీల పరిమాణం గల కార్బన్ డయాక్సైడ్ ను సేకరించి, దీనిని హైడ్రోజన్ వాయువుతో కుదింపు చేసి, చివరిగా మిథనాల్ ద్రవాన్ని పొందే ప్రక్రియను ఈ ప్లాంట్ లో చేపట్టనున్నారు. ఈ ప్రయోగాత్మక ప్లాంట్ నిర్మాణం ఇప్పటికే ప్రారంభమైందని, డిసెంబర్ 31 నాటికి పూర్తవుతుందని సంస్థ ఛైర్మన్ మరియు ఎండీ ఎన్.బలరామ్ తెలియజేశారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో లాంఛనంగా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రంలో బొగ్గు మండించగా వచ్చే కర్బన ఉద్గారాలను 99.9 శాతం వరకు వాతావరణంలో కలవకుండా నివారించడం కోసం ఇ.ఎస్.పీ. (ఎలక్ట్రో స్టాటిక్ ప్రెసిపిటేటర్స్) ను నెలకొలిపారు. ఈ విధానంలో చివరిగా వాతావరణంలోకి అనుమతించబడిన వాయువు నుండి మాత్రమే ఈ కార్బన్ డయాక్సైడ్ వాయువును స్వీకరించడం జరుగుతుంది. థర్మల్ పవర్ ప్లాంట్ చిమ్నికి అనుబంధంగా ఈ ప్రయోగాత్మక ప్లాంట్ నిర్మాణం జరుగుతోందన్నారు.

**పూర్తయిన సివిల్ నిర్మాణాలు: ఈనెలలో యంత్రాల ఏర్పాటు:**

కార్బన్ డయాక్సైడ్ నుండి మిథనాల్ తయారు చేసే ప్లాంట్ లో ఇప్పటికే సివిల్ నిర్మాణాలు పూర్తయ్యాయి. వీటిలో కార్బన్ డైయాక్సైడ్ను సంగ్రహించే యూనిట్ ను, హైడ్రోజన్ జనరేషన్ యూనిట్ ను, కంప్రెషన్ యూనిట్ ను, మిథనాల్ డిస్టిలేషన్ యూనిట్ ను ఏర్పాటు చేయనున్నారు. ఈ యంత్ర విభాగాలలో కొన్ని ఇప్పటికే నిర్మాణ ప్రాంతానికి చేరుకోగా మరికొన్ని ఈ నెలాఖరుకు చేరుకోనున్నాయి. సింగరేణి సౌజన్యంతో, నిర్మాణ సారథ్యంలో కోల్ ఇండియా అనుబంధ రీసర్చ్ యూనిట్ అయిన సీఎం పిడిఐఎల్ వారి ఆర్థిక సహకారంతో, ఈ ప్లాంట్ నిర్మాణం చేపట్టారు. నిర్మాణ బాధ్యత మరియు ప్లాంట్ నిర్వహణను బెంగళూరుకు చెందిన జవహర్లాల్ నెహ్రూ సెంటర్ ఫర్ అడ్వాన్స్డ్ సైంటిఫిక్ రీసెర్చ్ మరియు బ్రెత్ అప్లైడ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ కి అప్పగించారు . ఈ ప్లాంట్ నిర్మాణానికి సుమారు 20 కోట్ల రూపాయల ఖర్చు కానుంది. మిథనాల్ తో బహువిధ వ్యాపార ప్రయోజనాలు ఈ ప్రయోగాత్మక ప్లాంటు ప్రారంభమైన తర్వాత రోజుకు 180 కేజీల మిథనాల్ తయారు జరగనుంది. ప్రస్తుతం దీనిని ఎవరికీ విక్రయించ బోవడం లేదు. ప్రయోగం విజయవంతం అయితే పెద్ద ఎత్తున మిథనాల్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి సింగరేణి సంసిద్ధంగా ఉంది. మిథనాల్ ను ఎరువుల తయారీలో, అక్రిలిక్ ప్లాస్టిక్, సింథటిక్ ఫైబర్ వస్త్రాల తయారీలో, ప్లైవుడ్, పెయింట్స్ తయారీలో కూడా విస్తృతంగా వినియోగిస్తారు. కనుక వ్యాపార విస్తరణ చర్యలో భాగంగా పెద్ద ఎత్తున మిథనాల్ ప్లాంట్ ఏర్పాటు చేసి, ఈ మిథనాల్ ను వివిధ పరిశ్రమలకు సింగరేణి సంస్థ అమ్ముకునే అవకాశం ఉంది. దేశీయ అవసరాల కోసం వినియోగిస్తున్న 120 మిలియన్ టన్నుల మిథనాల్ లో దాదాపు 80 మిలియన్ టన్నులను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. దేశీయంగా ఉత్పత్తి దిశగా ఈ ప్రయోగాత్మక ప్రాజెక్టు విజయవంతం అయితే అది భవిష్యత్లో ఏర్పాటు చేసే ప్లాంట్ల ద్వారా దేశానికి ఎంతో ఆర్థికంగా ఎంతో లబ్ధి చేకూర్చే అవకాశాలు ఉన్నాయి.

# సొంత నిర్ణయాలతో యాంటీబయోటెక్స్ వాడకండి

- యాంటి బయోటెక్స్ వాడితే మనిషి బాడీ వ్యవస్థ దెబ్బ తినే ప్రమాదం ఉంది
- జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. కళావతి బాయి





**ఖమ్మంనగరం, నవభూమి,నవంబర్18:** అనవసరంగా సొంత నిర్ణయాలతో యాంటి బయోటిక్స్ వాడటం, తెలిసి తెలియని ఆర్.ఎం.పి., పి.ఎం.పి. లు చెప్పారని యాంటి బయోటెక్స్ వాడితే మనిషి బాడీ వ్యవస్థ దెబ్బ తినే ప్రమాదం ఉందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. కళావతి బాయి చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ సోమవారం నుండి వచ్చే ఆదివారం వరకు ప్రపంచ యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ కార్యక్రమం పై అవగాహన వారోత్సవాలులో భాగంగా స్థానిక మామిళ్లగూడెం అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగిస్తూ ఇబ్బడి ముబ్బడిగా యాంటీ బయోటిక్స్ ఎక్కువగా వాడటం వలన రాబోయే కాలంలో వచ్చే జబ్బులకు ఆ రోగికి పనిచేయక పోవడం వలన జబ్బులు తగ్గక పోవటం జరుగుతుంది అని చెప్పారు. అర్హత కలిగిన డాక్టర్లు చెప్పిన విదంగా ఎన్ని రోజులు వాడాలో అన్ని రోజులు వాడితే యాంటీ బయోటెక్స్ పని చేస్తాయని, ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఆరోగ్యాన్ని కాపాడుతాయని, అర్హత కలిగిన డాక్టర్లు ప్రిస్క్రిప్షన్ ఉంటేనే యాంటి బయోటెక్స్ మందులను అమ్మాలని మెడికల్ షాపుల యజమానులకు సూచించారు. ఈ రోజు నుండి కార్యక్రమం పై ప్రజలలో అవగాహన కల్పించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రల వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డియంహెచ్ఓ డాక్టర్ సైదులు, వైద్యాధికారి డాక్టర్ కృష్ణ చైతన్య, డెమో జి.సాంబశివ రెడ్డి, టీ. ఉపేందర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# వేద పాఠశాల అభివృద్ధికి నా వంతు పూర్తి సహకారం అందిస్తా

**షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్, రూ. 1.25లక్షల విరాళం**



**షాద్‌నగర్ నవభూమి ప్రతినిధి :** రంగా రెడ్డి జిల్లా ఫరూఖ్ నగర్ మండలం కిషన్ నగర్ గ్రామ శివారులో కాశి వేద పాఠశాలలో కాశీ జగద్గురు చంద్రశేఖర శివచార్య స్వామిని కలసి ఆశీస్సులు తీసుకున్న షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్, ఒక సంవత్సరం పాటు 50 సోమవారాల్లో కాశీ విశ్వనాథ దేవాలయంలో అర్చన కోసం ప్రతి సోమవారం 2500 రూపాయలు చొప్పున 1,25,000 రూపాయలు కాశీ జగద్గురువులకు అందజేయడం జరిగినది,ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశాల విశ్వం దంపతులు, వేద పాఠశాల అభివృద్ధి కమిటీ అగ్గనూర్ బసవేశ్వర్, భువనేశ్వర్ కాశీనాద్, వేద పాఠశాల అర్చకులు సంగయ్య స్వామి, పట్టణ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య, మాజీ ఎంపీటీసీ కట్ట వెంకటేష్ గౌడ్,అగ్గనూర్ నందు, ఆకుల వీరేశం, తుపాకుల శేఖర్, మాణిక్యం, తదితరులు పాల్గొన్నారు.

# స్వార్ధ రాజకీయాల కోసం అభివృద్ధిని అడ్డుకున్నారు

**గత పాలకుల కండ్లు చెదిరేలా అభివృద్ధి చేసి చూపిస్తాం, చరిత్రలో మంచి పేరే శాశ్వతం**

**మినీ ట్యాంక్ బండ్‌గా జానమ్మ చెరువు సుందరీకరణ, ప్రస్తుతం రు. 2 కోట్లతో చెరువు కట్టపై అభివృద్ధి పనులు**

**షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**షాద్‌నగర్ నవభూమి ప్రతినిధి :** గతంలో పాలించిన నాయకులు తమ స్వార్ధ రాజకీయాల కోసం అభివృద్ధిని పూర్తిగా అడ్డుకున్నారని, కానీ ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉందని ఎలాంటి వివక్షకు తావు లేకుండా ప్రజలకు సుస్థిరమైన పాలన అందిస్తూ అభివృద్ధి చేసుకుంటూ ముందుకు పోతున్నామని షాద్నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని జానమ్మ చెరువు అభివృద్ధిలో భాగంగా మినీ ట్యాంక్ బండ్ గా మార్చేందుకు రెండు కోట్ల రూపాయలతో చేపట్టబోయే పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాలకులు ఎవరైనా సరే అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయాలను పక్కనపెట్టి నిస్వార్ధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కానీ గత పాలకులు స్థానిక నాయకులను ఇబ్బంది పెట్టే విధంగా అభివృద్ధి కార్యక్రమాలకు అడ్డుకట్ట వేశారన్నారు. షాద్ నగర్ మున్సిపల్ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించేందుకు జానమ్మ చెరువున మినీ ట్యాంక్ బండ్ గా అవతరించబోతుందన్నారు. ఇందులో భాగంగా ప్రస్తుతం రు. 2 కోట్లతో చెరువుకట్టపై వాకర్స్ ట్రాక్ తో పాటు, ప్లాట్ ఫాం, రేలింగ్ వంటి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. తర్వాతి దశలో చెరువు సుందరీకరణకు కావాల్సిన అన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఆయన తెలిపారు. స్థానిక పదవ వార్డ్ కౌన్సిలర్ శ్రావణి ఎంతోకాలంగా చెరువు సుందరీకరణకై ప్రయత్నాలు చేసినా గత పాలకులు ఆమెకు సహకరించలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మెన్ నరేందర్, కమిషనర్ చీమ వెంకన్న, కౌన్సిలర్ శ్రావణి, మాజీ మున్సిపల్ చైర్మన్ విశ్వం, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు లింగారెడ్డి గూడ అశోక్ తదితరులు పాల్గొన్నారు

# విన్నర్‌గా మణుగూరు మజ్జు టీం రన్నర్‌గా సత్తుపల్లి టిఎన్‌బి

- ■ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా
- ■ ఆషా మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలు
- ■ బహుమతులు అందించిన విపంచి, విరాజీ

**సత్తుపల్లి, నవభూమి, నవంబర్ 18 :** జలగం వెంగళరావు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ క్రీడా ప్రాంగణంలో ఆషా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయ క్రికెట్ పోటీలు సోమవారం తో ముగిశాయి. ఈ పోటీల్లో విజేతగా మణుగూరు మజ్జు టీం, ఉన్నదిగా సత్తుపల్లి టి ఎన్ బి టీం నిలిచాయి. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఆధ్వర్యంలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆషా మెమోరియల్ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. సత్తుపల్లి టి ఎన్ బి టీమ్, మణుగూరు మజ్జు టీమ్ ఫైనల్ లో తలపడగా మణుగూరు మజ్జు టీమ్ విజేతగా నిలిచింది. మొదటి బహుమతి రూ. 50,000 రూపాయలు, కప్ ను ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి, డాక్టర్ దయానంద్ దంపతుల కుమార్తెలు విపంచి, విరాజిత అందించారు. రన్నరప్ గా నిలిచిన టి ఎన్ బి టీమ్ కు రూ. 30,000 రూపాయలు, కప్ ను మట్టా దంపతుల కుమార్తె లు విపంచి, విరాజీ లు అందించారు. ఆషా టోర్నమెంట్ లో పాల్గొన్న 16 జట్లు కు, విజేతలకు, టోర్నమెంట్ నిర్వాహకులకు%ఓ% మట్టా యువసేన టీమ్ కు డాక్టర్ మట్ట రాగమయి దయానంద్ దంపతులు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడు సేవా కార్యక్రమాలు, క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తామని మట్టా దంపతుల కుమార్తె లు విపంచి, విరాజీలు అన్నారు. టోర్నమెంట్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు కు మ్యాన్ అఫ్ ది మ్యాచ్, మ్యాన్ అఫ్ ది సీరీస్, బెస్ట్ ఫిల్డర్ లకు బహుమతులను పట్టణ సిఐ టి కిరణ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు చల్లగుండ్ల నరసింహారావు, గాదే చెన్నకేశవరావు, సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజల రాణి, కౌన్సిలర్స్ మందపాటి పద్మ జ్యోతి రవీందర్ రెడ్డి, దూరిపాల రాంబాబు, కంటే నాగలక్ష్మి, కాంగ్రెస్ నాయకులు గోలి శ్రీనివాసరెడ్డి, ఎండి కమల్ పాషా, మట్టా యువసేన సభ్యులు పాల్గొన్నారు.











# సింగరేణి కార్మికులకు మెరుగైన వైద్య సౌకర్యం కల్పించాలి

■ **సిఐటీయు**

**కొత్తగూడెం నవంబర్ 18 నవభూమి ప్రతినిధి:** సింగరేణి కార్మికులకు సరైన వైద్యం అందక అనేక ఇబ్బందులు పడుతున్నారని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు తో కూడిన బృందం డైరెక్టర్ పా వెంకటేశ్వర్ రెడ్డి కి సోమవారం మెమోరండం ఇచ్చారు. డైరెక్టర్ స్పందిస్తూ కార్పొరేట్ హాస్పటల్ కు రిఫర్ చేసే సందర్భంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆన్లైన్లో వైద్యం చేకూరే విధంగా వెంటనే సర్క్యులర్ జారీ చేసేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సింగరేణి హాస్పిటల్స్ లో డాక్టర్లు, స్పెషలిస్టులు, మరియు సిబ్బంది సరిపడ లేనందువల్ల కార్మికుల కు సరైన వైద్యం అందక తమ విలువైన ప్రాణాలను కోల్పోతున్నారు. అలాగే సరేనా యంత్రాలు, టెక్నీషియన్స్ లేకపోవటం వల్ల కూడా ఆర్థికంగా సింగరేణి ఎంతో నష్టపోతున్నది. ఉదాహరణకు స్కానింగ్ మిషన్ కంపెనీలు లేకుండా ప్రైవేటు వారితో చేయించడం వల్ల ఒక్కొక్క దానికి రూ అయిదువేలు చెల్లించాల్సి వస్తుంది,దాని అసలు ధర రూ 1800 వివరించారు. కార్మికులకు సరియైన మందులు దొరకక డబ్బులు చెల్లించక అనేక ఇబ్బందులు పడుతున్నారని, కొత్తగూడెంలో, గోదావరిఖనిలో పూర్తిస్థాయి వైద్యం అందించే పద్ధతిలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ సౌకర్యం కార్మికులకు అందించాలని సిఐటియు డిమాండ్ చేసింది. ఆన్లైన్లో కుటుంబ సభ్యుల ఫోటోలతో సహా వివరాలు కంప్యూటర్లో ఆన్లైన్లో ఉంటాయి కాబట్టి డైరెక్టుగా పద్ధతిని అమలు చేయాలి అలాగే కంపెనీకి ఎస్టిమేషన్కి సమయంపడుతుంది. కార్పొరేట్ హాస్పిటల్ లో ఇతరులకు ఇచ్చిన సౌకర్యాలు కూడా సింగరేణి కార్మికులకు కల్పించడం లేదు. సింగరేణి అనుమతించే మొత్తము మాకు సరిపోదని అనేక బిల్లులు కంపెనీ వద్ద పెండింగ్ ఉంటున్నా అనే నెపంతో వైద్యం చేయక



కార్పొరేట్ హాస్పిటల్స్ వారు వైద్యం చేయటానికి నిరాకరిస్తున్నారని, కంపెనీ అన్నిటికీ సాంక్షన్ చేయటం లేదు కాబట్టి మీరు డబ్బులు పెట్టుకుని స్టేట్మెంట్ ఇస్తామని బలవంతంగా డబ్బులు కట్టించినట్టున్నారని సిఐ టియు నాయకులు పేర్కొన్నారు. వాటికి సరైన బిల్లులు కూడా ఇవ్వటం లేదు. ఎమర్జెన్సీ కేసులలో ఈ ఆలస్యం వల్ల అనేకమంది కార్మికుల ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. వీటన్నిటికీ పరిష్కారంగా కుటుంబకార్డు లు జారీ చేసి దానిపై ట్రీట్మెంట్ ఇచ్చే పద్ధతి ప్రవేశపెట్టాలని సిఐటియు డిమాండ్ చేస్తున్నది. కార్మికుడికి యాక్సిడెంట్ రిపోర్ట్ లో హాస్పిటల్లో జాయిన్ అయితేనేమో తొందరగా ఫిట్ చేస్తారు కానీ వేరే జబ్బులతో హాస్పటల్లో జాయిన్ అయితే నెలల తరబడి తిప్పుతూ ఫిట్ చేయకుండా ఈ పద్ధతిని మార్చాలని సిఐటియు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కొత్తగూడెం బ్రాంచ్ జి రాజారావు యూనియన్ రాష్ట్ర నాయకులు సూరం ఐలయ్య తో పాటు ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు